# చెదిరిన మబ్బులు

సందు మళుపులో ఆ వీధిలోవుండే వాళ్ల పిల్లలందరూ పెద్ద గుంపుగూడి బొంగరాలు విసురుతూ, ఈలలు వేస్తూ చప్పట్లు కొడుతున్నారు. ఆటల్లో వాళ్లు పొందుతున్న అంతులేని ఆనందం ముందు రేగిన తలలూ, కారే ముక్కులూ, చినుగుల్లోంచి తొంగి చూసే బొమికెలూ, ఒంటినిండా మురికి మరకలూ చాలా అప్రధానమైన విషయాలుగా కనిపిస్తున్నవి.

కేరింతలు కొడుతున్న పిల్లల గుంపుకేసి చూస్తూ సుందరి వీధి అరుగుమీద బొమ్మలాగే నిలబడిపోయింది. తనూ వాళ్లలాగే మట్టిలో, తోటల్లో, దొడ్లలో, బొడ్డు క్రిందికి లాగులు జారిపోతుంటే— ఇక్కడ వున్నారు అక్కడ లేరనటానికి వీల్లేకుండా— గాలిలాగా అంతటా గంతులేసే మగపిల్లల గుంపులతో కలిసి ఆడుతూ పాడుతూ తిరిగిన చిలిపి రోజులన్నీ కళ్లముందు కదులుతున్నయ్. వాళ్లని చూస్తుంటే సుందరికి తాను నిజంగా అప్పుడే పదహారేళ్ల దాన్నయానా అని అనుమానం కలుగుతుంది. వాళ్ల గుంపులో తనూ కలిసిపోయి గంతులెయ్యాలని సుందరి మనస్సు ఉబలాట పడుతుంది. వాళ్లంతా తనకి తమ్ముళ్లూ చెల్లాయిలూ అయినట్లు కనిపిస్తున్నారు సుందరికి. తనలాగే వాళ్లూ పేదరికంలో పుట్టి పెరుగుతున్నారు. కొంపల్లో పెద్దల గొడవలు వాళ్లని చీమ కుట్టినంతైనా బాధించవు. దూసుకుపోయే తూనీగల్లాగా, ఆ నిర్భాగ్యులు లోకంలో ఆనందాన్నంతటినీ లూటీ చెయ్యటానికి బయలు దేరిన రౌడీ జట్టులాగా సుందరి కళ్లకు కనిపిస్తున్నారు. వాళ్ల కేకలతో, ఈలలతో ఆకాశం గింగురుమంటుంటే

సుందరి తన పదహారేళ్ల పెద్దరికాన్ని క్షణంసేపు మరచి పోయి చప్పట్లు కొట్టింది. ఆ సందులో పిల్లలంతా తనని అక్కయ్యా అని పిలుస్తుంటే సుందరి పొంగిపోతుంది. తను వాళ్ళందరికీ పేదరికంలో, కష్టాలలో పెద్దక్క. తనని కని తల్లి చనిపోయిందని అమ్మమ్మ చెబుతూవుంటుంది. తల్లి పోయిన కొద్దికాలానికే తండ్రి చనిపోయాడట. కాని ఆయనెవరో, ఏంపని చేసేవాడో సుందరికి తెలియదు. తండ్రిమాట వచ్చినప్పుడల్లా అమ్మమ్మ తెలివిగా ప్రసంగం మార్చేస్తుంది. ఏమీ చెప్పకుండా దాచేస్తుంది. నిజానికి సుందరికి తల్లీ తండ్రీ రెండూ అమ్మమ్మే. తనని కడుపులో పెట్టుకు పెంచింది. క్షణంసేపు తను కనిపించక పోతే అమ్మమ్మా అంటూ వెతుక్కుంటూ ఇల్లిల్లూ తిరుగుతుంది. సుందరికి ఆశ్రయం అమ్మమ్మ ప్రేమ; ఆధారం ఆ పాత పెంకుటిల్లు. దాన్ని ఎన్నోవాటాలుగా తడికెలతో కేటాయించి అద్దెల కిచ్చారు. ఆ డబ్బుతోనే ఎల్లాగో కాలక్షేపం జరుగుతోంది. సుందరికి ఏ చీకూ చింతలేదు. అమ్మమ్మ చాటున హాయిగా పెరుగుతోంది. కనక ఆమె హృదయం ఆ పిల్లల అల్లరితో పల్లవి కలుపుతోంది.

ఇంతలో కారు హారన్ గట్టిగా కొట్టడం వినిపించింది. ఆడుకుంటున్న పిల్లలు కారు తమవైపుకే జోరుగా రావటం చూసి తొందర తొందరగా సుందరిగారి అరుగుదగ్గరికి పరుగెత్తారు. ఆ ఇరుకు సందులోకి కారు రావటం పిల్లిలందరికీ పండగలాగా వుంది. అటువంటి పేదకొంపల మధ్యకి కారు రావటం చాలా అసాధారణ విషయమే.

సందు మలుపు దగ్గరికి వచ్చిందో లేదో కారు పెద్ద ఉరుము ఉరిమినంత చప్పుడుతో అటుఇటూ కదలకుండా ఆగి

పోయింది. కారు నడుపుతున్న యువతి చరాలున తలుపుతీసుకొని కిందికి దిగివచ్చింది. పిల్లలంతా కారుని చుట్టేశారు. "ఏం జరిగిందీ?" అంటూ కారులోంచి ఒక యువకుడు దిగివచ్చి చక్రాలు నాలుగూ పరీక్షగాచూశాడు. ముందు చక్రాలలో ఒకటి నేలకి అంటుకుపోయింది. కొయ్యబొంగరం ముల్లు రబ్బరు చక్రంలోకి గుచ్చుకుపోయింది. ఖంగారుగా ఆట కట్టేసి పరిగెత్తటంలో పిల్లలు మరిచిపోయిన బొంగరం యింతపని చేసింది. ఆ కారు గర్వాన్ని అణచి కర్ణుడి రథచక్రంలాగా నేలలోకి కూరుకు పోయేట్లు చేసింది.

చుట్టూ మూగిన ఆ పిల్లల్ని పురుగుల్లాగా దులపరించుకుంటూ ఆ యువకుడు "ఛీ, ఛీ, ఈ వెధవపిల్లలకి బుద్ధిలేదు, దారిలోనా మీ ఆటలు? మీ పెద్దలు అన్నం తింటున్నారా? గడ్డి తింటున్నారా? ఎక్కడపడితే అక్కడేనా మీ ఆటలు?" అని గదమాయించాడు. కొందరు పిల్లలు బిక్కమొహాలు వేశారు. కొందరు కారుచాటున నక్కారు. కొందరు కారునడుపుతూ వచ్చిన ఆ గులాబి సిల్కుచీరె యువతికేసి వింతగా చూస్తున్నారు.

ఇందాకటినించీ అరుగుమీదినుంచి ఈ హంగామా చూస్తున్న సుందరి ఒక్క అంగలో ఆ గుంపుమధ్యకి వచ్చింది. కోపంతో కందిన ముఖంతో "చాల్లేవయ్యా! పెద్దమనిషీ. జాగ్రత్తగా రానీ మాటలు. మా పిల్లలు ఎక్కడ ఆడుకుంటారనుకున్నావు? మాకు మీలాగా బంగళాలూ, మేడలూ లేవు బాబూ, అసలు బుద్ధితక్కువ మీదే. మా కొంపలమధ్యకి ఎందుకొచ్చారు? చల్లగాలికి షికారు బయలుదేరిన వాళ్ళు ఏ ఊరిబైటకోపోక మా ఇరుకు సందులకి రావటం దేనికయ్యా? బొంగరాలు వేసుకునే పిల్లల్ని చెదరగొట్టింది చాలక పైగా వాళ్ళు ఆడుకోటం పొరబా

టని దండిస్తున్నావా? చాలు చాలులేవయ్యా!" అని ఒక్క గుక్కలో అనేసింది. కారులో వచ్చిన యువతీ యువకుడూ సుందరికేసి విస్తుపోయి చూస్తూ నిలబడిపోయారు. కారుచుట్టూ మూగిన పిల్లలు కాకిగోల సాగించారు. ఈగోల వింటుంటే కారులో వచ్చిన నాగరిక యువతిముఖం జేవురించింది. యువకుడు ఏంచెయ్యాలో తోచక దిక్కులుచూస్తూ వేళ్లతో క్రాపు సర్దు కుంటున్నాడు.

"ఎందుకల్లా బిక్కమొహాలు వేస్తారు? ముందే వుండాలి జాగ్రత్త. ఇంకెప్పుడూ అనవసరంగా నోరు జారకండి. ఈ సందు మలుపు మా పిల్లలు ఆడుకోటానికే పుట్టింది తెలుసా?" అంటూ సుందరి సేనానాయకురాలుగా ఆ పిల్లల పటాలంకేసిచూసి 'ఊఁ' అంది. ఆ వానరసైన్యం అంతాకలిసి కారుని ముందుకి తొయ్యటం మొదలు పెట్టారు.

కత్తివేసినా నెత్తురు చుక్కలేని మొహాలతో యువతీ యువకుడూ చకచకానడిచి వెళ్లిపోయారు. ఇంటికి వెళ్లి డ్రైవర్ని పంపిస్తే వాడే తంటాలుపడి కారు ఇంటికి చేరుస్తాడనీ ముందు ఈ కాకిమూకలోంచి బైటపడితేచాలనీ వాళ్లిద్దరూ చకచకా అక్కణ్నుంచి వెళ్లిపోయారు.

"ఆ కారుజోలి మనకెందుకూ? మీ దారిన మీరుపోయి ఆడుకోండి" అంది సుందరి. పిల్లమూక అంతా మళ్లీ బొంగరాల ఆటలోకి దిగింది.

"అమ్మాయ్! ఎక్కడున్నావే?" అని అమ్మమ్మ పిలుపు వినబడగానే "వస్తున్నాను అమ్మమ్మా" అంటూ సుందరి ఒక్క పరుగులో ఇంట్లోకి వెళ్లిపోయింది.

తను సుడిగాలిలాగా చెలరేగి ఎన్నిమాట లన్నప్పటికీ ఆ యువతి కళ్లప్పగించి వెలవెలబోతూ నోరు మెదపకుండా నిల బడింది. ఆ యువకుడికి తనని మింగేటంత కోపం వచ్చిందని అతని కందినముఖమే చెప్పింది. వాళ్లిద్దరూ తనకి తెలియని ఏ దూరపు లోకంనుంచో దిగివచ్చిన వ్యక్తుల్లాగా కనిపించి సుందరిని ఆశ్చర్యంలో ముంచివేశారు. వాళ్లు వెళ్లిపోయినా ఆ గులాబి సిల్కుచీరె, అతని ఖద్దరు సిల్కులాల్చీ, మల్లెపువ్వులాంటి గ్లాస్కోపంచె, అందకుండా మెరిసే ఇంద్రధనస్సులాగా వాళ్లిద్దరూ సుందరి కళ్లముందు కదులుతూనే వున్నారు.

ఇంట్లోకి వెళుతూనే సుందరి గోడనున్న మకిలి పట్టిన అద్దంలో తన ముఖంచూసుకుంది. తనూ అందమైనదే! కాని ఆ యువతి మెళ్లో వెయ్యిమిణుగురుల మాదిరి తళుక్కున మెరి సిన రవ్వల గొలుసు తనకేది? సంధ్యాకాశంలో చిరుగాలికి తేలిపోయే గులాబి మబ్బులని మరిపించే ఆ జార్జెటు చీర తనకి కలలోనైనా దొరుకుతుందా? అవును, ఆమెకీ, తనకీ పోలికలు యెక్కడ? తన ప్రతిబింబాన్ని చూస్తుంటే సుందరికే నవ్వొ స్తోంది. తనమీద తనకే జాలీ, హేళనా! కాని, ఆ యువతిని చూసీ చూడటంతోనే సుందరి మనస్సుని ఒక ఊహ చరుక్కున పొడిచింది. తనకీ ఆ యువతికీ ముఖకవళికల్లో కనుముక్కుతీరుల్లో ఏదో పోలిక వున్నట్లు స్ఫురించింది. తన దూకుడు మాట లన్ని టినీ మౌనంగా భరించిన ఆ యువతిని ఎక్కడో చూసినట్లు, తనకూ ఆమెకీ ఏదో మరుపు తగిలిన బాంధవ్యం వున్నట్లు సుందరి మనస్సు అలజడిపడింది. ఇదంతా ఆధారంలేని కల్పనల అల్లిక! కాకపోతే కారులోంచి దిగిన ఆ యువతికీ తనకీ భూమికీ ఆకాశానికీ

వున్నంతదూరం వుంటే—అనవసరంగా తను ఆ యువతికి దగ్గరగా వెళ్లాలని మనస్సులో బాధపడటం దేనికి?

"ఎక్కడి కెళ్లాలే సుందరీ? పెళ్లీడు కొచ్చిన పిల్లవి అలా యెక్కడికి పడితే అక్కడికి పోవచ్చునటే తల్లీ?" అని మందలింపుగా అంది అమ్మమ్మ వంటగదిలోంచి.

"ఇక్కడే వున్నానమ్మమ్మా; అరుగుమీదకూడా పోకుండా ఈ చీకటి కూపంలోనే ఉక్కిపొమ్మంటా వేమిటి?" అని తన సహజధోరణిలో దురుసుగా అనేసింది సుందరి.

వీధిలో చెప్పుల చప్పుడు విని ఇద్దరూ ఉలిక్కి పడ్డారు. ఓరగావున్న తలుపు సందునుంచి "అమ్మాయ్ సుందరీ!" అని పిలుపు వినిపించింది.

"రండి బాబయ్యాగారూ రండి. మేమింకా గుర్తున్నామన్నమాట!" అంటూ సుందరి ఎదురు వెళ్లింది.

"పనిమీద ఈమధ్య పట్నం వెళ్లానమ్మా. ఊళ్లోవుంటే ఇన్ని రోజులు రాకుండా ఎప్పుడైనా వున్నానా? బాగున్నారా? విశేషా లేమిటి?" అంటూ సుందరి బుజంమీద చెయ్యివేసి మెల్లిగా నడచివచ్చి వాల్చిన నులక మంచంలో కూచున్నాడు చంద్రశేఖరం. నల్లటి గిరజాల జుట్టులోంచి అక్కడక్కడా తొంగి చూసే నెరిసిన వెంట్రుకలు ఆయన నడికారు మనిషి అని చాటుతున్నయ్. ఆయన పెదవులమీద మధుర దరహాసం, ముఖంలోని ప్రశాంత గాంభీర్యం, అప్యాయంతో నిండి తొణికే మాటల తేటతనం చంద్రశేఖరాన్ని ఈదీనకుటుంబానికి ఆప్త బంధువుని చేసినై. తీరిక వున్నప్పుడల్లా వీళ్ల కష్టసుఖాలు విచారించి పోతూవుంటాడు. ఫీజుకోసం పేచీపెట్టకుండా బీదల ఆపదల్లో రెక్కలు కట్టుకొని వాలే వైద్యుడు ఆ వూళ్లో ఆయన ఒక్కడే. ఈ యింటికి ఆయన

కేవలం వైద్యుడే కాకుండా మిత్రుడిగా, బంధువుగా వస్తూ వుంటాడు. ఆయన అండ వుండటంవల్ల ఈ దీనులు యెన్నో చిక్కుల్లోంచి బైటపడ్డారు. చంద్రశేఖరం ఇంట్లోకివస్తే ఏదో పెద్ద కాంతి వచ్చినట్లు, పెన్నిధి దొరికినట్లు సుందరి అమ్మమ్మా పొంగి పోతారు.

"పిల్లకి పెళ్లీడు వచ్చింది" అంటూ అమ్మమ్మ ఉపక్రమించేసరికి బెదిరిన లేడిలాగా సుందరి వంటింట్లోకి పరుగు తీసింది. సుందరి సిగ్గుని చూసి చంద్రశేఖరం చిరునవ్వు నవ్వుకున్నాడు.

అమ్మమ్మ మళ్లీ అందుకుంది. వాళ్ల పెంకుటింట్లో ఒక వాటాలో ఒక కుర్రాడు అద్దె కుంటున్నాడు. మంచి బుద్ధిమంతుడు. అందమైనవాడు. ఏదో ఇంత చదువుకుని పదిరాళ్లు తెచ్చుకుంటున్నాడు. ఈడూ జోడూ, అందం చందం అన్నివిధాలా దీటయిన సంబంధం. అ కుర్రాడితో సుందరి చనువుగా కబుర్లు చెబుతూ వుంటుంది. ఆ కుర్రాడిదగ్గిరే సుందరి పాటలు నేర్చుకుంటోంది.

డాక్టరు బాబాయ్‌గారి నోటినించి ఏ జవాబు వస్తుందో అని ప్రాణమంతా బిగబట్టుకుని ఒళ్లంతా చెవులు చేసుకుని వంటింటి తలుపు చాటున నక్కింది సుందరి. "సుందరి పెళ్లి విషయం తొందర పడకండి. ఆలోచించి తగిన ఏర్పాటు నేను చేస్తాను" అని బాబాయ్ ముక్తసరిగా అన్నప్పటికీ ఆ మాటలు విన్న అమ్మమ్మకి కొండంత ధైర్యం వచ్చింది.

"నువ్వే మా పాలిటి భగవంతుడివి నాయనా! దాన్ని ఒక యింటిదాన్ని చేసే భారం నీదే నాయనా?" అంటూ ముసలమ్మ "సుందరీ! బాబయ్యగారికి నమస్కారం చెయ్యవేమిటే? వెళ్తున్నారు...." అంది,

"ఇక్కడికి రాకపోతే నేనే అక్కడి కొస్తానులే" అంటూ చంద్రశేఖరం వంటింటి తలుపు చాటునున్న సుందరిని ఉద్దేశించి "వెళ్లొస్తానమ్మా. రేపు మా యింటి కోసారి వస్తావా సుందరీ!" అన్నాడు.

"అల్లాగే వస్తాను బాబాయ్" అంటూ ఇంకో ద్వారంలోంచి బైటికొచ్చి సుందరి ఆయన పాదాలకి నమస్కారం చేసింది.

*   *   *

ఇంత జోరు వానలో హోటలుకి పోకపోతే ఈ పూట మా యింట్లో భోజనం చెయ్యకూడదా నాయనా?" అని అమ్మమ్మ అనే సరికి సారథి వెనక్కి తిరిగిచూస్తూ చట్టున ఆగిపోయాడు.

"కాస్త వానలో తడిస్తే ఆయనేం మొక్క మొలిచి పోడులే వెళ్లనీ. బతిమాలించుకోటానికి అంతూ పొంతూ వుండక్కర్లా" అంటూ సుందరి అమ్మమ్మ చాటునుంచి సారథికేసి కోపంగా చిలిపిగా నవ్వింది.

"అల్లాగే. మీ మాట కాదనగలనా?" అంటూ సారథి గిరుక్కున వెనక్కి ఇంట్లోకి తిరిగి వచ్చాడు.

సుందరికీ సారథికీ ఒక్కపంక్తిన వడ్డించి అమ్మమ్మ పట్ట లేని సంబరంతో మునిగిపోయింది. వీళ్లిద్దరూ భావిజీవితంలో భాగస్వాములై, జంట తెరువరులై సంసారపథంలో సాగిపోతూ వుంటే ఎంత మనోహరంగా వుంటుంది!

"నాయనా, మీ వాళ్లెవరూ చూసి పోవడానికైనా వొచ్చి నట్లు కనపడరేం—" అంది ముసలమ్మ.

"నావాళ్లనే వాళ్లెవరూ లేరండి, నేను ఒంటరిగాణ్ని."

"అయితే తెలియక అడుగుతాను నాయనా! మరొాకలాగా అనుకోకేం, నీకు మీ వూళ్లో భూవసతి ఎంత వుందో? ఇల్లూ, వాకిలీ ఎవరు చూస్తూవుంటా రక్కడ?"

"వాటి భారం నేను మొయ్యలేనని మా వాళ్లు ముందే జాగ్రత్త పడ్డారు లెండి. నాకు పూచికపుల్ల కూడా మిగల్చకుండా పుణ్యం కట్టుకున్నారు. నా రెక్కలే నా ఆస్తి" అంటూ సారధి నవ్వుతూ తేల్చివేశాడు. ఎంత బరువైన విషయాన్నయినా ఇట్టే నవ్వుతూ చెప్పేస్తాడు.

"ఎందుకమ్మమ్మా నీకీ విషయాలన్నీ? ఏదోకూపీ లాగే దానికిమల్లే ఒకటే ప్రశ్నలు కురిపిస్తున్నావు. ఉక్కిరి బిక్కిరయి ఆయన సగం అన్నమే కతికి లేచిపోయేట్లున్నాడు" అని సుందరి తెలివిగా అడ్డుతగిలింది.

"ఏం అనుకోకు నాయనా! వెర్రిబాగుల దాన్ని. ఒకయింట్లో వుంటున్నాం కనక ఒకళ్ల కష్టసుఖా లొాకళ్లం తెలుసుకుంటే తప్పులేదని అడిగాను—" అని నొచ్చుకున్న స్వరంలో అంది ముసలమ్మ.

"నాకులేని కష్టం సుందరికెందుకో తెలియటంలేదు. మీరడిగిన ప్రశ్నల్లో తప్పేముంది? మీరే నాకు చుట్టాలూ, స్నేహితులూను: మీ ముందు నాకు దాపరికమేమిటి మామ్మగారూ" అంటూ సారధి భోజనం పూర్తిచేసి సంతృప్తిగా పొట్ట నిమురుకుంటూ లేచాడు.

తన గదిలోకి వెళ్లి దీపం పెద్దదిచేసి ఏదో పరధ్యానంగా ఆలోచిస్తూ కూచున్నాడు. పడుకోబోయేముందు సుందరి ఒక్కసారి అద్దెకున్న వాళ్లందరినీ పలకరించి వస్తుంది. వెళ్లకపోతే

సుందరికి తోచదు. సుందరి రాకపోతే అద్దెవాళ్లకీ పిచ్చెక్కినట్లుగా ఉంటుంది.

పక్కగదిలో ఒక గాయకుడు కాపురం వుంటున్నాడు. మర్నాడు ఎక్కడో పాటకచ్చేరికోసం సాధన చేసుకుంటున్నాడు. అక్కడ క్షణంసేపు ఆగి సుందరి సారథి గదిబైట నిలబడి "ఏమండోయ్ కవిగారూ! లోపలికి రావచ్చునా?" అంది. "కవి దగ్గరకి కవిత రాకూడని సమయమంటూ వుందేమిటీ?" అని సారథి సుందరి కేసి ఆహ్వాన పూర్వకంగా చూశాడు. "అబ్బెబ్బే! ఏమిటి చిందరవందర గదినిండా! యెక్కడ గుడ్డలక్కడే. యెక్కడ సిగరెట్ ముక్క లక్కడే" అంటూ సుందరి గదిలోకి వస్తూనే అన్నిటినీ సవరించేసింది. "వొద్దు వొద్దు. ఎందుకు నీకింత శ్రమ చెప్పూ? అని సారథి అడ్డు చెప్పినా సుందరి మానలేదు.

"గది ఇల్లావుంటే ఇందులో వుండేవాళ్లు జంతువులో మనుషులో తెలియదు" అని సుందరి నవ్వుతూ అంది. ప్రతి మనిషిలోనూ జంతువుంది కదా!" అన్నాడు సారథి. "నిన్ననే కదా ప్రతి మనిషిలోనూ ఈశ్వరాంశ వుందని చెప్పావు?" "అవును. రెండూ నిజమే! అది సరేకాని, నిన్న మధ్యలో ఆపేసిన పాట వినిపించవూ?" అని సారథి అడగ్గానే సుందరి అందుకున్నది. ఆ కంఠం కొండరాళ్లమీద గలగల గంతులేసే సెలయేరులాగా సాగిపోతుంది. ఆ కంఠంలో కొసరుకుంటూ కూసే కోకిలపాటలూ, మత్తెక్కిన తుమ్మెదల ఝుంకారాలూ, ఒళ్లు పులకరించేట్లు పలుకుతయ్. అలా సుందరి పాడుతున్నంతసేపూ కాలం కదలకుండా నిలిచిపోయి నట్లనిపిస్తుంది. సుందరి ముఖంకేసి ముగ్ధుడైపోయి చూస్తూ సారథి "నిజంగా ఈ పాట నేనే రాశానా అనిపిస్తోంది సుందరీ!" అన్నాడు.

"పోనీ ఎవరిదైనా దొంగిలించారేమో! నాకేం తెలుసునూ!"

"కాదు. నువ్వు పాడుతుంటే నన్ను నేనే నమ్మలేక పోతున్నాను. నామాటలకి ఎదో కొత్తప్రాణం వచ్చినట్లనిపిస్తోంది. ఇన్నాళ్ళూ నా పాటల పంజరంలో మూగగా పడివున్న నా మాటలు ఇవాళ రెక్కలాడించుకుంటూ, మాధుర్యంతో ఆకాశాన్ని రింగు మనిపిస్తూ మబ్బుల్లోకి దూసుకుపోతున్నట్లుగా వుంది. అందుకే ఈ పాట నేను రాసిందేనా అని నాకు అనుమానం కలుగుతోంది."

"నాకు నిద్రొస్తోంది బాబూ! నీ మాటల్లో ఒకటికూడా నాకు బుర్ర కెక్కటంలేదు. పోతాను" అంటూ అదుగో అక్కడ అని వేలెత్తి చూపేలోపల్నే మాయమయిపోయే మెరుపుతీగవలె సుందరి అదృశ్యమైపోయింది.

పాడుపడిన చీకటింటి కప్పులోంచి తొంగిచూసే సూర్య కిరణం మాదిరిగా వస్తుంది సుందరి. ఆ కిరణాన్ని చూడగానే నిద్రపోయే ధూళిరేణువులు పరవశ నాట్యం చేసినట్టుగా సారథి మనస్సులో తెలిసీ తెలియని కోరికలూ, ఆశలూ గంతులు వేస్తాయి. దూరపు పూలతోటల సువాసనలని మోసుకవచ్చి క్షణం సేపు మనస్సుని గిలిగింతలుపెట్టి ఇట్టే పారిపోయే మందమలయా నిలం మాదిరిగా సుందరి చడీ చప్పుడూ లేకుండా వెళ్ళిపోతుంది.

ఏదో చదువుకుంటూ అల్లాగే దీపంకూడా ఆర్పకుండా పడక్కుర్చీలో సారథి నిద్రపోయాడు.

అద్దెలకున్న వాళ్ళతో చనువుగా తిరగకూడదని అమ్మమ్మ హద్దులుపెట్టదు. ఆ యింట్లో ఒకసారి అద్దెకి చేరినవాళ్ళు ఖాళీచేసి వెళ్ళడమంటూ వుండదు. ఆ ముసలమ్మ వాళ్లందరినీ ఆప్తబంధువు ల్లాగా ఆదరిస్తుంది. వాళ్ల అద్దెలతోనే తనూ సుందరీ ఎల్లాగో కాలం వెళ్లదీస్తున్నారు. వాళ్లంతా తన కుటుంబీకు లయినట్లే ఆమె

వాత్సల్యం అందరిమీదా చిలకరిస్తుంది. అధ్యాత్మ రామాయణం కీర్తనలు వాణికే గొంతుతో పాడుకుంటూ సుందరిని పక్కలో పెట్టుకుని ఒక్క కునుకుతీస్తుంది. నిద్రపోతున్న సుందరిని చూస్తుంటే తన కూతురు గుర్తుకొచ్చి కుమిలిపోతుంది. కూతురు తలుపుకొస్తే చాలు నిలువునా నీరయిపోతుంది. ఆస్మృతి ముసలమ్మ గుండెల్లో ఆరని చిచ్చు. తనకి ఒక్కత్తేకూతురు. చిన్న వయస్సులోనే వైధవ్యం ప్రాప్తించింది. ఎంతో కట్టుబాటుగా పెరిగి పెద్దదయింది. నిప్పులాటి మనిషి అనిపించుకుంది. కాని.... చివరికి.... ఒక ధనవంతుడు వేసిన వలలో చిక్కుకుపోయింది.... కాలు జారింది.... ఫలితమే సుందరి.... సుందరికి ఇంకొంచెం దగ్గరగా జరిగి ముసలమ్మ తనని తను ఓదార్చుకొని నిద్రపోయింది.

* * * *

"సుందరీ! నేను చెప్పిన సంగతి గుట్టుగా నీ మనస్సులో పెట్టుకోవాలి సుమా! ఈ రహస్యం నువ్వు ఎక్కడా వెల్లడించకూడదు. సమయం వచ్చినప్పుడు నేనే దీన్ని బైటపెట్తాను. ఇది నీ మంచిని కోరి చెబుతున్నానమ్మా. తొందర పడకూడదు. తొణుకూ బెణకూ లేకుండా వుండాలి...." అని డాక్టరు చంద్రశేఖరం ముగించి సుందరితల వాత్సల్యంతో నిమురుతూ మనస్సులో ఆ దీనురాలిని దీవించాడు.

"నీ మాట నేనెప్పుడైనా కాదన్నానా బాబాయ్! మీరు ఏది మంచిదని తోస్తే అలా చేయండి. చెప్పిన రహస్యాన్ని నా ప్రాణంతో సమంగా కాపాడుతాను. నా నోట్లో నువ్వుగింజయినా దాగదని అమ్మమ్మ అంటుంది. కాన ఈ సంగతిమటుకు ఇంకెవ్వరికీ తెలియనివ్వనని చెబుతున్నాను" అంది బాబాయికేసి చూస్తూ సుందరి. ఆయన ఏదో పరధ్యానంగా వున్నాడు. ఆయన

ఏదో పరధ్యానంగా వున్నాడు. ఆయన విశాలమైన కళ్లు అర్థంకాని భవిష్యత్తులోకి తొంగిచూస్తున్నట్లుగా వున్నయ్.

"ఇక వెళ్లనా బాబాయ్?" అంది సుందరి.

తన ఊహల్లోంచి తుళ్లిపడి "వెళ్లిరా తల్లీ! ప్రయాణానికి సిద్ధంగా వుండు. ఇవాళే మంచిరోజు. సాయంత్రం నాలుగింటికల్లా బయలుదేరాలి" అన్నాడు చంద్రశేఖరం.

"ఓ అలాగే మరి" అంటూ సుందరి వెళ్ళిపోయింది.

వెంటనే చంద్రశేఖరం సరాసరి మాధురి యింటికి బయలు దేరాడు. ఆయన అన్నగారి కూతురు మాధురి. తనకి పిల్లలు లేక పోవడంవల్ల మాధురి ఆయనకుప్రాణం. మాధురికికూడా పినతండ్రి అంటే అమితమైన ప్రేమ. ఆయనంటే యెంత చనువో అంత గౌరవం; ఎంత భయమో అంత భక్తి. ఆయన విశాలహృదయం ఉదార ఆశయాలూ మాధురి జీవితానికి రూపురేఖలు తీర్చి దిద్దిన వని చెప్పవచ్చును. కావటానికి అన్నగారి కూతురైనప్పటికీ చంద్ర శేఖరం స్వభావం మాధురి స్వభావంలో అచ్చుగుద్దినట్లుగా కని పిస్తుంది.

"అమ్మాయ్!" అని అప్యాయం తొణికిసలాడే కంఠ స్వరంతో పిలిచాడు మాధురిని గదిబైట నిలబడి.

"ఎవరదీ? బాబాయిగారేనా? ఇంత యెండలో నడిచి వచ్చారేమిటి? రండి రండి" అంటూ కుర్చీ వేసింది మాధురి. ఆ వేళప్పుడు కాలినడకన పినతండ్రి తన దగ్గరికి నడిచి వచ్చి నందుకు కలిగిన ఆశ్చర్యం మాధురి కళ్లలో మెరిసింది. తలంటి పోసుకున్న జుట్టు వొదులుగా చంపలమీదికి, ముఖంమీదికి వాలు తోంది. పలచటి జరీ చీరె లేత నీలపు రంగులో మాధురి రూపం తొలకరి మబ్బులో మెరుపు తీగలాగా మెరిసిపోతోంది. అందానికి

తగిన హుందాతనం, గాంభీర్యం ఆమె ముఖమండలంలో వెలుగు తున్నయ్.

నడిచివచ్చిన సేద తీర్చుకుంటూ, ఉత్తరీయంతో విసురు కుంటూ "అమ్మాయ్ ! నీతో ఒక ఆవసరమైన పనిఉండి వచ్చాను. నీసాయం వేడుకోటానికి వచ్చానమ్మా" అన్నాడు చంద్రశేఖరం.

వింతగా మాట్లాడుతున్నారేం బాబాయ్ ? నన్ను మీరు అన వసరంగా పెద్దదాన్ని చేస్తున్నారు. వేడుకోట మేమిటి ? ఆజ్ఞాపిం చండిం. శిరసావహిస్తాను. సంకోచిస్తారేం ?" అని మాధురి పమిటతో ఒళ్లు కప్పుకుంటూ వినయంగా తలవంచి నిలబడింది.

"నువ్వలా అంటావని నాకు తెలుసు తల్లీ ! కాని ఇది కొంచెం క్లిష్టమైన విషయం" అని ఆగాడు చంద్రశేఖరం. "ఎంత క్లిష్టమైనాసరే ఆజ్ఞాపించండి. మీమాటే నాకు వేదవాక్యం" అంది మాధురి.

"అయితే చెప్పనా తల్లీ ! నీకు శ్రమ కలిగిస్తున్నందుకు వేరేమీ అనుకోకమ్మా, ఒక దీనురాలి విషయంలో వచ్చాను. పెళ్లీడు కొచ్చిన పిల్ల. మీ పిన్ని బాగుంటే దాన్ని మా యింట్లోనే పెంచుకునే వాణ్ణి. ఆ అదృష్టం నాకులేదు" అని కొంచెంసేపు ఆగాడు. చనిపోయిన భార్య మనోవీధిలో మెరిసింది. మాధురికి కూడా పిన్ని గుర్తుకొచ్చి కళ్లు తడిసినయ్.

"ఆ పిల్ల భారం నువ్వు వహించగలవా తల్లీ ? దానికి చదువూ సంగీతాలు నేర్పి దాన్నొక యింటిదాన్ని చెయ్యాలి. నీకు అప్పగిస్తే నేను నిశ్చింతంగా వుండొచ్చు. దాన్నికూడా నీ అంత దాన్నిగా తయారుచెయ్యగలవనే ధైర్యం నాకుంది." అని మాధురి ముఖంకేసిచూశాడు. బాబాయి నోటివెంట వచ్చిన ప్రశంసకి ఆమె ముఖం సిగ్గుతో కందింది.

ఆ దిక్కులేని పిల్ల ఎవరో? ఎక్కడుందో? ఆ పిల్లమీద బాబాయికి ఎందుకో యింత ఆసక్తి! సందేహాలనీ సంకోచాలనీ దూరంగా నెట్టివేసి "ఈ విషయం మీ రింతగా చెప్పాలా? మీ మాట యెప్పుడైనా నేను కాదని యెరుగుదునా? చెబితే ఈ క్షణమే వెళ్లి ఆ అనాథ బాలికని తీసుకొచ్చి నా దగ్గర వుంచుకుంటాను. నా సొంత చెల్లెలులాగా చూసుకుంటాను, ఏ లోటూ లేకుండా పెంచి పెద్దదాన్ని చేసేభారం నాది." అంది మాధురి నిశ్చయం నిండిన స్వరంతో.

ఈ మాట వినగానే చంద్రశేఖరం మనస్సు పులకించింది. ఆనందాశ్రువులు తెలియకుండానే చెక్కిళ్లమీదుగా జారినయ్. చకితురాలయిపోయింది మాధురి. బాబాయ్ కళ్లల్లో నీళ్లు చిందటం యెన్నడూ ఎరగదు. ఎంత కష్టమైన సరే, తను బాబాయికి యిచ్చిన మాట నిలుపుకొని తీరాలని, ఆ తెలియని దీనురాలి భావి భారమంతా తనే వహించాలనీ ఆ క్షణంలోనే మాధురి మనస్సులో రూఢి చేసుకుంది. "అయితే ఆ పిల్ల ఎక్కడుంది బాబాయ్?" అని కుతూహలంగా అడిగింది.

"ఈ వూళ్లోనే వుందమ్మా! ఒక మారుమూల సందులో పాడుపడిన కొంపలో మగ్గుతుంది. ఆ పిల్లని ఆ దుర్గంధంలోనుంచి లేవనెత్తి ఆమె జీవితానికి రూపురేఖలు దిద్దే భారం నువ్వే వహించాలి తల్లీ! ఈ కోరిక చెల్లించినందుకు ఈ బాబాయి నీ మేలు యెన్నటికీ మరచిపోడు" అంటూ లేచాడు కుర్చీలోంచి.

"అయితే యివాళెందుకు వెళ్లకూడదు మనం?" అని మాధురి అడగ్గానే "సరేనమ్మా! అల్లాగే కానీ, ఇవాళే వెళ్దాం. మంచిరోజు కూడాను." అని ఒకమెట్టుదిగి ఆగిపోయి "అమ్మాయ్!

అల్లుడుగా రెక్కడ ? ఆయన అనుమతి తీసుకోనక్కర్లేదా ?" అన్నాడు.

"ఆయన మూడో అంతస్తు గదిలో ఏదోబొమ్మ గీయటంలో మునిగిపోయి వున్నారు. నేను చేయదలచిన మంచిపనికి వారి అభ్యంతరం ఎప్పుడూ వుండదు—" అని కొంచెం ధీమాతో నిండిన కంఠంతో మాధురి బదులు చెప్పింది.

"అయితే మరీ మంచిది తల్లీ! వెళ్లొస్తాను. నాలుగింటికి వస్తాను."

"నువ్వు శ్రమపడి రావటమెందుకూ ? నేనే వస్తాను బాబాయ్. అక్కణ్ణుంచి ఇద్దరంకలిసి వెళ్లొచ్చు." అని చంద్రశేఖరాన్ని గుమ్మండాకా పంపించి వచ్చింది.

సరిగ్గా నాలుగయేసరికి మారుమూల సందులో సుందరి ఉండే పాతకొంప ముందు కారు హారను మోగింది. లేడిలాగ ఛంగున వాకిట్లోకి ఒక్క గంతువేసింది సుందరి. తమ గుమ్మంలోనే కారు ఆగింది. అందులో బాబాయితో బాటు ఒక యువతి దిగుతోంది. ఆమెకేసి చూడగానే సుందరి గుర్తుపట్టేసింది. ఆనాడు పిల్లల బొంగరం గుచ్చుకొని ఆగిపోయిన కారులో కనిపించిన యువతే యివాళ మళ్లీ వచ్చింది. తను ఆనాడు సుడిగాలిలాగా ఎంత చెలరేగి వాగినా నోరు మెదపకుండా నిలబడిన ఆ యువతే యివాళ మళ్లీ తన కళ్లెదుట నిలబడింది. క్షణంసేపు సంకోచంతో, సిగ్గుతో సుందరి ముఖం ముకుళించుకు పోయింది. "రండి, లోపలికి రండి" అని మర్యాదగా అని కళ్లప్పగించి ఆ యువతి కేసి చూస్తూ నిలబడిపోయింది.

"ఈ పిల్లని ఎక్కడో చూసినట్లుంది బాబాయ్" అని మాధురి సుందరికేసి పరీక్షగాచూసింది. ఆశ్చర్యంతో విప్పారిన

కళ్లలో అణుచుకుంటున్న చిలిపితనం దోబూచులాడుతుంది. మడమలదాకా రాని పాత పరికిణీ, మీదవేసుకున్న ముతకవల్లెవాటూ సుందరి చామనచాయ శరీరాన్ని పూర్తిగా దాచలేకుండావున్నయ్. ఆ విశాలమైన నుదుటి మీదుగాజారుతూ నల్లటి నొక్కులజుట్టు గాలిలో కదులుతూవుంది. ఎరుపు ఏడిందాల పెట్టు అంటారు కాని ఈ సుందరి చామనచాయ ముఖంలోవున్న కళాకాంతులముందు ఎవరి అందమైనా తులతూగుతుందా అనిపించింది మాధురికి. సుందరి కను ముక్కుతీరు అంతా ఏదో సిద్ధహస్తుడైన దివ్యశిల్పి తీర్చి దిద్దినట్లనిపిస్తుంది. ఆ పెదవులమీది చిలిపి చిరునవ్వు, ఆమె కళ్ల ముందు మెరిసినయ్.

"నీ పేరేమిటమ్మా ?" అంటూ దగ్గరికి వెళ్లి సుందరి గడ్డాన్ని మునివేళ్లతో తాకుతూ ముద్దుగా ఆమె ముఖాన్ని పైకెత్తి "నాతో వస్తావుకదూ ?" అని ఆప్యాయంగా అడిగింది మాధురి.

"ఒస్తాను. నాపేరు సుందరి." అంటూ తూనీగలా లోపలికి వెళ్లిపోయింది.

తన గుడ్డలన్నీ సర్దుకుని కట్టుకున్నమూటతో రివ్వున తిరిగి వొచ్చి సుందరి కారులోకి ఎగిరి గంతేసి కూచుంది. పసిపిల్లలాగా చేతుల్తో చప్పట్లు కొట్టింది పట్టలేని సంబరంతో.

తలుపు చాటున నిలబడి అమ్మమ్మ కళ్లుతుడుచుకుంటోంది. "నువ్వుకూడా రాకూడదూ ?" అని కేకపెట్టింది సుందరి ఏడుస్తున్న అమ్మమ్మని ఉద్దేశించి.

"నే నెందుకు తల్లీ ? నా ఘటం యిల్లా వెళ్లిపోనీ. నువ్వు సుఖంగావుంటే నాకదే పదివేలు" అని అక్కడ నిలబడలేక ముసలమ్మ లోపలికి వెళ్లిపోయింది.

తన గది కిటికీలోంచి సారథి వెళ్లిపోతున్న సుందరికేసి రెప్పవాల్చకుండా విగ్రహంలాగా చూస్తూ నిలబడి పోయాడు. కారు కదులుతుంటే సుందరి వెళ్తున్నానని చెయ్యి ఊపింది. గుంపు కూడిన పిల్లలంతా కాకిగోలచేస్తూ కారువెంట పరిగెత్తుతూ కోలాహలంగా సుందరిని సాగనంపారు.

పదహారేళ్ల కారాగారవాసంనుంచి విముక్తి పొంది కొత్త వెలుగులోకి, కొత్త సుఖంలోకి రివ్వున ఎగిరి పోతున్నట్లుగావుంది సుందరికి. గిరగిర తిరిగే కారుచక్రాలతో అర్థంకాని భావా లెన్నో సుందరి మనస్సులో చరచరా కదిలిపోతున్నయ్. పుట్టి పెరిగిన వాతావరణాన్ని విడిచివస్తున్న బాధని ఒకమూల పెట్టేసి పట్టలేని ఆనందం వింతరంగుల రెక్కల్ని విప్పి సుందరి మనస్సులో చిందులు తొక్కుతోంది.

దూరంలో కలిసిపోతున్న కారుకేసిచూస్తూ కిటికీ చువ్వలకి కరచుకుని నిలబడి పోయిన సారథి ఎంతో సేపటికి తేరుకున్నాడు. బరువుగా నిట్టూర్చి "నా రాచిలుక ఎగిరిపోయింది. బంగారు పంజరాన్ని వరించి ఎగిరిపోయింది" అనుకున్నాడు.

* * *

ఆ మూడంతస్తుల మేడని చూసేసరికే సుందరి కళ్లు గిర్రున తిరిగినయ్. మేడచుట్టూ పెద్ద తోటా, ప్రహరీ గోడా; మధ్యలో గిరగిర తిరుగుతూ నీటితుంపురులు చుట్టూ వెదజల్లుతున్న ఫౌంటెన్. ఆ జలచక్రాన్ని తన తలమీద ధరించి చిలిపి చిరునవ్వు నవ్వుతూ పూలబాణం విసరటానికి సిద్ధంగావున్న పాలరాతి మన్మధవిగ్రహం మేడలోకి వెళ్లబోతున్న సుందరిని క్షణంసేపు విస్తుపోయి నిలబడి పోయేట్లు చేసింది. "పద, లోపలికి పోదాం" అని మాధురి చెయ్యి పుచ్చుకుని ముందుకు లాగేదాకా సుందరి ఆ విగ్రహాన్నిచూస్తూ నిలు

చుంది. ఏదో యెరగని లోకంలోకి మాధురి తనని నడిపించుకు పోతున్నట్లుగా వుంది. ఇన్నాళ్ళూ తనకి అందని దూరంలో నిలబడిన ఆనంద జగత్తు ఇవాళ తన అందమైన చేతులు జాపుతూ సుందరిని ఆహ్వానిస్తున్నట్లుగా వుంది.

మెట్లదగ్గర ఒక యువకుడు యెదురుగా వచ్చాడు. క్షణం సేపు సుందరికేసి పరకాయించి చూశాడు, సుందరికూడా అతన్ని రెప్పవాల్చకుండా చూసింది. ఆ యువకుణ్ణి సుందరి ఇట్టే గుర్తు పట్టేసింది. ఆనాటి సాయంకాలం ఆగిపోయిన కారుని నడిపించడం కోసం అష్టకష్టాలుపడి వేసారిపోయింది ఈయనే! ఆసంగతి గుర్తు తగలగానే సిగ్గుతో నేలచూపులు చూడటం మొదలు పెట్టింది.

"ఈ అమ్మాయేనా? పేరేమిటి?" అన్నాడు మాధురికేసి చూస్తూ మధుసూధనరావు.

"అవును, ఈ పిల్లే, పేరు సుందరి. అల్లా సిగ్గుపడతావెందుకమ్మా? ఆయన పరాయి మనిషనుకున్నావా? మీ బావగారు!"

"ఓహో అల్లాగా! నమస్తే బావగారూ" అంది కొంటెగా నవ్వుతూ కళ్ళ చివరినించి దొంగచూపులుచూస్తూ సుందరి.

"దయచెయ్యండి మరదలుగారూ! దయచెయ్యండి. తమ దర్శనం మాకిదివరకే ఎక్కడో లభించనట్లుంది. గుర్తుందా మాధురీ? ఆరోజు ఇరుకు సందు మలుపులో బొంగరం గుచ్చుకొని కారు చెడిపోయినపుడు మరదలుగారి ప్రతాపం రుచిచూశాం కదూ?" అంటూ నవ్వాడు. మాధురి పెదిమెలమీదకూడా మందహాసం మెరిసింది. సంకోచంతో వెనకాడుతున్న సుందరి రెక్కపుచ్చుకుని లోపలికి తీసికెళ్ళింది మాధురి.

రంగుతివాచీ పరిచిన హాల్లో అడుగుపెడితే మాసిపోతుం దేమో ననిపించింది సుందరికి. తిరిగే పంకాలూ మెరిసే అద్దాల బీరువాలూ, వరసగా అమర్చిన కుర్చీలూ, సోఫాలూ చూసి సుందరి బిత్తరపోయింది. నే నేమైనా కల కంటున్నానా అనుకుంది.

"కూచో" అని మాధురి సుందరిని మెత్తటి సోఫాలోకి తోసింది. ఆ సోఫా ఊగుతుంటే సుందరి కొంచెంసేపు బెదిరింది కాని తర్వాత సంబరంతో చప్పట్లు చరిచింది.

"అక్కా ! ఇకరోజూ నే నీ కుర్చీలో కూచోవచ్చా ?"

"ఆఁ. ఇది నీ సొంత యిల్లనుకోవాలి. నీ ఇష్టం వచ్చినట్లు బెరుకులేకుండా వుండొచ్చు."

"అయితే నేనూ నీలాటి చక్కటి బట్టలు వేసుకొని కార్లో షికారు రావచ్చా అక్కా !"

"తప్పకుండానూ !" అంది మాధురి.

"బెంగ వేసినప్పుడు కారెక్కి వెళ్లి అమ్మమ్మని చూసిరా వచ్చునా అక్కా ?"

"ఆ ! నీ యిష్టం. ఇవన్నీ నీ సొంతంగా భావించుకోవాలి తెలుసుగా! నీకు ఏం కావాలన్నా నన్నడుగు. నీ కేలోటూ లేకుండా చూస్తాను. చదువూ సంగీతం నేర్పిస్తాను. నీ కోసం ఒకగది శుభ్రం చేయించి అట్టేపెట్టాను. పద" అని గది లోనికి తీసి కెళ్లింది. తెరిచిన అద్దాల తలుపుల్లోంచి నీలాకాశం మెరుస్తూ కని పిస్తోంది. ఆ ఒక్కగదే తను యిన్నేళ్లు పెరిగివచ్చిన అమ్మమ్మ యింటికంటే విశాలంగావుంది. గదిలో వంకెకి తన మూట తగి లించి అటూయిటూ పచార్లుచేసింది. కిటికీదగ్గర నిలబడి దూరాన బారులుతీర్చిన కొండలకేసి చూసింది. అప్రయత్నంగా మనస్సులో సారథి మెరిశాడు. కిటికీచువ్వలకి ఆనుకొని దీనంగా తనకేసి

చూస్తున్న అతని రూపం గుర్తుకిరాగానే సుందరి మనస్సు చివుక్కు-మన్నది. అతను కారాగారపు కటకటాలు వెనక నిలబడివున్న ఖైదీలాగా కనిపించాడు. ఆ చెరలోంచి తను విడుదలై పోయి బైటపడింది. ఇప్పుడిక తనకి ఆ మురికి సందులతోనూ ఇరుకు గోడలతోనూ పనిలేదు. అనంతాకాశంలో రివ్వున యెగిరిపోయే డేగలాగావుంది సుందరి హృదయం.

అక్క-ణ్ణుంచి బయలుదేరి ఆ మూడంతస్తుల భవనం మూల మూలలా శోధించటానికి పూనుకుంది సుందరి. అంత పెద్దయింట్లో వుండేది ముగ్గురు మనుషులే. ఇల్లంతా నిద్రపోతున్నట్లుగావుంది. ఆ నిశ్శబ్దాన్ని తన చేతిగాజుల గలగలతోనూ తన పరుగుల సందడితోనూ మేలుకొలుపుతూ సుందరి భవన మంతా సుడి గాలి లాగా చుట్టు తిరిగి వచ్చింది. కిటకిట లాడే జన సమ్మర్దంలోంచి వచ్చిన సుందరి ఈ యిల్లు బావురు మంటు నట్లుగా వుంది. కింద ఎన్నో గదులు ఖాళీగా తాళాలుపెట్టి వున్నయ్. ఒక గదిలో మాధురీ, ఇంకో గదిలో మాధురి ముసలి అత్తగారూ, మేడమీద పై అంతస్తుగదిలో మధూ-మిగతా ఇల్లంతా నౌకర్లూ, దాసీలూ. ఇంత యిల్లే అమ్మమ్మకి వుంటే అందులో ఎన్ని సంసారాలు కాపురాలు చేసేవో అనుకుంది సుందరి.

"నమస్కా-రం మామ్మగారూ!" అంటూ సుందరి ముసలమ్మగారి గదిలోకి వెళ్ళింది.

"ఎవరు తల్లీ నువ్వు? నాకు చూపు సరిగా ఆనదమ్మా, మనుషుల ఆనవాలు బొత్తుగా తెలియదు. ఇంకాస్త దగ్గరికి రా" అని సుందరి ముఖాన్ని తన చేతుల్తో నిమిరింది.

"నేను యివాళే వొచ్చాను మామ్మగారూ! మాధురి అక్కాయి దగ్గర చదువుకోటానికి వచ్చాను. ఇక్కడే వుంటాను. మీకు ఏపని కావలన్నా నాకు చెప్పండి చేసిపెడతాను."

"మా బంగారు తల్లివికదే! ఎంత తియ్యగా మాట్లాడు తున్నావమ్మా. మనుషులకోసం మొహం వాచిపోయింది తల్లీ, ఈ ముసలి ఘటాన్ని ఆదరంగా పలకరించే వా ళ్లేవరున్నారమ్మా యీ కొంపలో?" అని ముసలమ్మ వొణుకుతున్న చేతుల్తో సుందరి వొళ్ళంతా నిమిరింది.

"నేను మీదగ్గరే పడుకుంటాను మామ్మగారూ! మీకు ఎన్నెన్నో కబుర్లు చెబుతాను. మీ పనులన్నీ నేనే చేస్తాను—" అని సుందరి మాధురి అత్తగారి అభిమానాన్ని ఇట్టే చూరగొన్నది. ఆవిడ ముఖం తోముకోటానికి నీళ్ళూ అవీ అందించటం, స్నానం చేయించటం, వేళకి అన్నం తీసుకువెళ్ళటం అన్నీ సుందరే చేస్తోంది. ఇన్నాళ్ళనుంచీ నౌకర్ల సేవతో విసిగిపోయిన ముసలమ్మ ప్రాణానికి సుందరి ఏ స్వర్గంనుంచో దిగివచ్చిన దేవతలాగా కనిపిస్తోంది. సుందరి గంటలతరబడి ఏవేవో కబుర్లు చేప్పేస్తుంది. మాధురి మౌనంతో విసిగిపోయిన ముసలమ్మ చెవులకి సుందరి మాటలు తేనెల సోనలుగా వున్నయ్. క్షణంసేపు సుందరి కనబడకపోతే ముసలమ్మ కొట్టుకుపోతుంది. సుందరి వచ్చిన దగ్గర్నుంచీ ముసలమ్మ సాధింపులూ, గొణుగుడూ చాల భాగం మాయమై పోయినయ్. కనీసం ముసలమ్మ కోసమైనా సుందరి ఈ యింట్లో వుంటం చాలా అవసరం అన్నాడు మధు నవ్వుతూ మాధురితో. "దాన్ని ఒక యింటిదాన్ని చేసేవరకూ మన యింట్లోనే వుంచుకుంటాను" అంది మాధురి.

"నేను కాదన్నానా" అన్నాడు మధు.

"అయితే నాకు నీ బొమ్మలు చూపించవా బావా? ఎప్పుడూ తలుపులు బిగించుకొని గదిలో కూచుంటావు. నీ దర్శనం దొరకటమే దుర్లభం అయిపోయింది" అంటూ వచ్చింది సుందరి.

"అడగందే యెందుకు చూపిస్తానూ? పదమరి" అని మెట్లెక్కాడు మధు. అతని అడుగుల్లో అడుగులువేస్తూ చకచకా పై అంతస్తు గదిలోకి నడిచింది సుందరి. ఆమె కళ్లకింద మేడ మెట్లు వీణతీగల్లాగా ఝంకరించినయ్. అడుగడుగులోనూ సుందరి ఏదో వింత కదలికని ఏదో కొత్త సోయగాన్ని నలుదిక్కులా వెదజల్లుతూ వుంటుంది. ఐదు నిమిషాలసేపు కాలుదగ్గర పెట్టుకొని ఒకచోట కూచోలేదు. లేడి పిల్లలాగా అటూయిటూ ఏదో పని ముంచుకు పోతున్నట్లు పరిగెడుతూ వుంటుంది. చిత్రకారుడైన మధు కళ్లకి సుందరి సీతాకోక చిలకలాగా, తూనీగలాగా, కొండలమీద గంతులువేస్తూ పారే సెలయేరులాగా, నిలకడలేకుండా అంతటా పరుగులుతీసే మలయపవనంలాగా కనిపించింది. కలతలేని కొలనులోకి రాయి విసరినట్లు అతని జీవితంలోకి యెవరో ఈ సుందరిని విసిరి కల్లోలం రేపినట్లుగా వుంది.

సంధ్యాసమయంలో ప్రశాంతంగా వుండే కాసారం మాధురి. పూర్ణిమ రాత్రి వెండివెలుగులతో చిందులుతొక్కే సాగరతరంగం సుందరి. ఆ తరంగం మధు అంతరంగాన్ని ఊయల లూపుతూ అంతరిక్షానికి ఎత్తుకు పోతున్నట్లుగా వుంది.

మాధురి మాదిరిగా మిసమిస మెరిసే పసిమిలేదు సుందరికి. నీరవ మాధుర్యంతో ఆత్మని అమేయ శాంతి సుధతో నింపివేసే శరద్విభావరి మాధురి.

అందకుండా మిలమల మెరుస్తూ దూరదూరంగా పరిగెత్తిపోయే మరీచిక సుందరి. ఈ మనిషి శరీరంలో రక్తానికి బదులు

పాదరసం ప్రవహిస్తున్నదేమో ననిపిస్తుంది. అంతులేని అశాంతినీ, తనివి తీరని కోరికలవీ, చేతికందని ఆశలనీ రగులుకొల్పే సుడి గాలి సుందరి. అలజడితో, కలకలంతో, అశాంతితో ఆత్మని ఉక్కిరి బిక్కిరిచేసి రుచిర స్వప్నాల జిలుగులతో కళ్లు జిగేలు మనిపించే సౌదామిని సుందరి.

సుందరి మధు కళ్లు విప్పించి, అతని అనుకూలదాంపత్యం అడుగున గూడు కట్టుకుంటున్న అసంతృప్తిని అతనికి అర్థం అయేట్లు చేసింది. సుందరిని చూసేదాకా మధుకి తను కోరేదేమిటో తెలియదు. ఏదో వెలితి అతని జీవితంలో వున్నట్లు బాధపడేవాడు. అదేమిటో సుందరితో పరిచయం కలిగాక అర్థం అయింది.

గాయకుడు రాగాలాపనకోసం బిగించి సిద్ధంగా అట్టేపెట్టు కున్న వీణ తీగల్లాగ వుంటుంది మధు మనస్సు. ఆ బిగువులో, భావాల ఊపులో ఏవేవో తెలియని లోకాల్లో ఒంటరిగా విహరిస్తూ వుంటాడు. తన ఉద్రేకాలనీ, ఆశలనీ, రంగుల్లోనూ, రాగంలోనూ నిలుపుకుంటూ నిరంతరం కళాసృష్టిలో నిమగ్నుడై వుంటాడు.

అతనిలోకం వేరు. ఇది మాధురి లోకానికి చాలాదూరం. ఈ లోకంలో పొరబాటునైనా అడుగుపెట్టటానికి మాధురి ఎన్నడూ పూనుకోలేదు. భర్త అనుభవాలని పంచుకోటానికీ మాధురి ప్రయత్నించలేదు. ఒకే యింట్లో వున్నా ఇద్దరూ రెండు వేరువేరు లోకాల్లో తిరుగుతున్నారు. మాధురికి యిల్లు చక్కదిద్దుకోటం, తీరిక సమయాల్లో కుట్టుపనిలో మునగటం, దారాలతో అల్లుకోవటం ఏవైనా పుస్తకాలు చదువుకోటం—ఇదే దినచర్య. భర్తధ్యానాన్ని భంగం చేస్తాననే భయంతో పగలు మేడమీదికయ్నా వెళ్లేది కాదు, కాని భర్తకి నిమిషమైనా ఇంచుమించు కాకుండా ఏ వేళకి

కాఫీ, ఫలహారం, భోజనం అందించాలో అతిశ్రద్ధగా తనే చూసుకునేది.

ఒడుదుడుకుల్లేకుండా, గాలిలో నడిచిపోయే బండిలాగా అతని కుటుంబజీవనం ఇంతవరకూ సాగిపోతోంది. జీవితంలో ఏవిధమైన మార్పూ లేదు. కొత్తదనం అసలే లేదు. నిత్యనూతనమైన ఆనందం కోసం వెంపరలాడే అతని కళాహృదయంలో ఒక మూల అసంతృప్తి విజృంభిస్తూ వుంది. మందకొడిగా దొర్లుకుపోయే జీవిత శకటానికి మలుపులూ కుదుపులూ కావాలనిపిస్తోంది. అతని జీవితానికి ఆగని గమనం ఎప్పటికప్పుడు కొత్త అందాలని చవిచూపి కొత్త లోతులకు కొనిపోగల కదలిక—కావాలి. ఇవి లేకనే అతని కళాహృదయపు మండే నిప్పులమీద నివురు కప్పుకుపోయింది. అతని జీవిత స్రవంతి చలనంలేని కొలనులాగా తయారయింది.

సుందరి ఆ యింట్లో అడుగు పెట్టింది మొదలు మధు హృదయం మునుపెన్నడూ ఎరుగని ఆనందంలో ఊయల లూగుతోంది. రోజురోజూ కొత్త పాటలూ, కొత్త చిత్రాలు వసంతకుసుమాలలాగా వెలువడుతున్నయ్. అడ్డుకట్టని తన్ని వేసిన కొండవాగు మాదిరిగా కళాపిపాస విశృంఖలంగా నిత్యనవీన సౌందర్యం కోసం పరుగులెత్తసాగింది.

అస్తమానం మధుదగ్గరే వుండి సుందరి రంగులు అందిస్తూ కుంచెలు కడుగుతూ, బొమ్మలు సర్దుతూ వుంటుంది. మధు ఏకొత్త పాట రాసినా సుందరి మధురంగా పాడి వినిపిస్తుంది. బావా అంటూ చనువుగా ఏవేవో కబుర్లు చెబుతూ వుంటుంది. గులకరాళ్ల మీద గలగలపారే సెలయేరు మాదిరి మధురంగా మాట్లాడుతూ వుంటుంది. సుందరి కబుర్లు మధుకి ఎన్నడూ విసుగ్గా

పనికి అడ్డుగా తోచలేదు. ఆ మాటలు అతన్ని గిలిగింతలు పెట్టి అందుకోలేని కళాశిఖరాలకి ఎగరటానికి పురికొలుపు తున్నట్లుండేవి. వాన బరువు లేకుండా, యెటు గాలికొడితే అటు విలాసంగా తేలి పోయే సంక్రాంతి మబ్బులాగా సుందరి అతని హృదయాకాశంలో తేలిపోతోంది.

మునుపటిలాగే సాయంకాలం మాధురీ తనూ కలిసి కారులో షికారు పోవటంలేదు! మాధురి పలకరించినా ముక్త సరిగా మూడు ముక్కలు మాట్లాడేసి వెళ్ళిపోతున్నాడు మధు. మాధురి ఆ యింట్లో వున్నదన్న విషయమే మరిచిపోయినట్లుగా భర్త ప్రవర్తిస్తున్నాడు. మేడమీది గదిలోంచి అస్తమానం పాటలూ, కబుర్లూ, నవ్వులూ, కేరింతలూ వినిపించి మాధురిని కలవరపెట్టేస్తున్నయ్. ఈ కోలాహలమంతా రాత్రి మాధురి గది లోకి వెళ్ళేసరికి చల్లారిపోతుంది. తనతో మాట్లాడదగిన విషయమే లేనట్లుగా భర్త పెదవి మెదపకుండా నిద్రపోతాడు. తన బాధని లోపలే అణుచుకుని మాధురి అతికష్టంమీద నిద్ర పట్టించుకుంటుంది.

సుందరి ముసలమ్మ దగ్గర కథలు వింటూ కబుర్లుచెబుతూ నిద్రపోతుంది. ఒక్కొక్క రోజు అమ్మమ్మమీద బెంగగా వుంటుంది. అప్పటికప్పుడే బయలుదేరి కారుమీద వెళ్ళి అమ్మమ్మ దగ్గిర ఆ రాత్రి వుండి వస్తుంది. ఆమె యెన్నిసార్లు వెళ్ళినా సారధి కనిపించటంలేదు. కనిపించి పలకరించినా దులపరించుకుని వెళ్ళి పోతున్నాడు. సారధి ముఖంకేసి చూస్తే అతని హృదయంలో బడబాగ్ని రేగుతున్నట్లు క్షణంలో తెలిసిపోతుంది. కాని క్రొత్త ప్రపంచపు మిరుమిట్లు గొలిపే వెలుగులో గుడ్డిదై పోతున్న సుందరి కళ్ళకు అతని వ్యథిత హృదయం కనిపించటంలేదు. అతనితో స్నేహమంతా గతకాలపు స్మృతిగా సుందరి మనస్సులో

అడుగున పడిపోయింది. అతని బాధని సుందరి అర్థం చేసుకునే స్థితిలోలేదు.

అంటే సుందరి పూర్తిగా మారిపోయింది. కష్టాలతో పుట్టి పెరిగిన సుందరి ఇట్టే తన గత జీవితాన్ని మాసిన చీరెని దూరంగా గిరాటు వేసినట్లు విసిరివేసింది. ఆ మూడంతస్తులమేడ, అందులోవున్న అందం, ఆనందం, నౌకర్లూ, కార్లూ యివి తప్ప వేరే లోకమే లేదు సుందరికి. రంగురంగుల చీరెలూ, రకరకాల నగలూ, విలాసాలూ, విశ్వాసాలూ సుందరి చుట్టూ వలలు వేసినయ్. ఇన్నాళ్ళూ తను యింత సౌఖ్యాన్ని అనుభవించ లేక పోయింది. ఇప్పుడు తరుణం వచ్చింది కనక వాటిని వడ్డీతో సహా రాబట్టుకోవాలన్నట్లు సుందరి అస్తమానం లాలసలో, పారవస్యంలో తేలిపోతోంది. మాధురి యెంత ప్రయత్నించినా సుందరికి చదువులో ఆసక్తి కలగడం లేదు. తనకి నచ్చినట్లు పాడుతుంది. కాని మాధురి చెప్పినట్లు శాస్త్ర కట్టుకి లొంగిరాదు. కష్టాలకి క్రుంగి పోకుండా, సుఖాలకి పొంగి పోకుండా, నిబ్బరంగా నిండు కుండ లాగా వుండటం స్త్రీకి అలంకారమని మాధురి ఎంత చెప్పినా సుందరి చెవిలో దూరలేదు. ఎప్పుడూ మిడిసిపడుతూ కులుకుతూ నిలువుటద్దం ముందు గంటలకొద్ది కాలం గడుపుతుంది సుందరి. తనకి యే మాట నోటికివస్తే అది దురుసుగా ఫెల్లున అనేస్తుంది సుందరి. ఆచి తూచి అవతలివాళ్ల మనస్సులు కందకుండా మాట్లాడే మాధురి సుందరి వైఖరికి యెంతో నొచ్చుకుంది. గట్టిగా చెబితే సుందరి కష్టపడుతుందేమో? చెప్పకపోతే సుందరి కట్టుబాట్లు లేకుండా విచ్చలవిడిగా పెరిగి మచ్చ తెస్తుందేమో ? ఆమె భావిని తీర్చిదిద్దేభారం తనమీద వేసుకుంది కాని, తన కర్తవ్యం యెలా నెరవేర్చాలో మాధురికి బోధపడడం లేదు.

సుందరి వచ్చిన దగ్గర్నుంచీ అత్తగారికి మాధురిమీద కోపం పెచ్చు పెరుగుతోంది. సుందరి మోస్తరుగా మాధురి తనకి సేవలు చెయ్యదనీ, తనతో పిచ్చాపాటీ బాతాఖానీ కొట్టదనీ కోడలి మీద కంఠందాకా వుంది అత్తకి. మాధురి మటుకు యెప్పటి మాదిరిగానే మసులుకుంటోంది.

ఆ రోజు చూసి పోవటానికి బాబాయి వచ్చాడు. "సుందరి కొత్త వొదిలి బాగా వుంటోందా ?" అని చంద్రశేఖరం అడిగాడు. "చాలా మంచి పిల్ల" అంది మాధురి మనస్సులోని బాధని అణగ దొక్కుకుంటూ. ఇదివరకు బాబాయికి తను ఇచ్చిన మాట నిలుపు కోటం కోసం యెంత బాధనైనా లోపల దిగమింగుకో దలిచింది మాధురి.

"సుందరీ !" అని పిలిచాడు చంద్రశేఖరం.

"మేడమీద వుంది పిలవమంటావా బాబాయ్ ?"

"వొద్దు. ఏంచేస్తోందీ అక్కడ ?" అన్నాడు ఆశ్చర్యంగా.

"బావగారి దగ్గర చిత్రలేఖనం నేర్చుకుంటోంది బాబాయ్" అని నవ్వుతూ బదులు చెప్పింది మాధురి. విషాన్ని కూడా చిరు నవ్వుతో అమృతంలాగ తాగేసే వ్యక్తులు కొద్దిమంది వున్నారు లోకంలో !

"అయితే వెళ్లొస్తానమ్మా ! ఈ దీనురాలిని గురించి సమయం వచ్చినప్పుడు అంతా వివరంగా చెప్తాను. అది పరాయి పిల్లలాగా నీ దగ్గర పెరగటం లేదు. సొంత చెల్లెలులాగా దాన్ని నువ్వు చూసుకుంటున్నందుకు నాకు బ్రహ్మానందం అవుతోంది తల్లీ" అంటూ వెళ్లిపోయాడు బాబాయ్.

అక్కడే నిలబడిపోయింది మాధురి స్తంభానికి జేర్లపడి. ఎవరీ సుందరి ? యెక్కణ్నుంచి వచ్చింది ? ఎందుకు వచ్చి తన

అందజేరింది ? నిర్మలంగా వున్న తన కుటుంబంలో ఎందుకింత కల్లోలాన్ని రేపుతున్నది? ఇంత అశాంతినీ బాధనీ తనెందుకు భరించాలి? నిరాధారంగా వున్న ఈ బికారిని చూసి జాలిపడి దగ్గరికి తీసినందుకు ఇదేనా ప్రతిఫలం ? మునుపున్న మురికి సందుల్లోకి ఈ సుందరిని తరిమివేస్తే హాయిగా యెప్పటిమాదిరిగా తన కాపురం కుదుటబడిపోదా ? కాని బాబాయికి తనుచేసిన వాగ్దానం ? ఈ దీనురాలికోసం నోరు తెరిచి యాచకుడిలా వచ్చి బాబాయి తనని అడిగాడు, ఆయన మర్యాద కాపాడవద్దా ? తన మాట నిలుపుకోవద్దా ?

డీకొన్న శత్రుసైన్యాలు ఒకళ్ళమీద ఒకళ్లు విసురుకునే బాణాల్లాగా ప్రశ్నలూ, యెదురు ప్రశ్నలూ మాధురి మనస్సుని తూట్లు పడేస్తున్నయ్. తల తిరిగిపోతోంది. ఏమైనా సరే, ఎంత దుర్భరమైనా సరే తను సహించాలి. సుందరి ఎల్లా ప్రవర్తించినప్పటికీ తన శాంతాన్ని సహనాన్నీ కోల్పోరాదు. ఈ సుందరి యెవరైనా సరే తనని పెంచి పెద్దదాన్ని చేసిన బాబాయి ముఖం చూసి అన్నిటినీ ధైర్యంగా యెదుర్కొని మౌనంగా భరించాలని మాధురి మనస్సులో రూఢిచేసుకుంది. కాని ఒకటిమటుకు మాధురికి ఆశ్చర్యంగా వుంది. ఇతరుల పంచనచేరి, పరుల దయాధర్మాల మీద ఆధారపడిన సుందరి ఇంత బేఫరవాగా ఇంత నిర్లక్ష్యంగా యెందుకు ప్రవర్తిస్తోంది. ఆ సిరి సంపదలకు తనూ భాగస్వామిని అయినట్లు; వాటిమీద తనకీ ఏదో అధికారమున్నట్లు సుందరి యెందుకు సంచరిస్తున్నదో మాధురికి అర్థం కావటంలేదు. వినయం, అణకువా ఏకోశానాలేవు సుందరిలో. అసలు సుందరి స్వభావమే ఒక అర్థం కాని కావ్యంగా కనిపిస్తోంది మాధురికి.

*     *     *     *

"ఏం నాయనా, వొంట్లో బాగాలేదా ? అల్లా ఉన్నావేం?" అని పలకరించింది సుందరి అమ్మమ్మ, ఆఫీసుకు వెళ్ళకుండా గదిలో ముసుగుతన్ని పడుకున్న సారధిని. మనిషి ఆనవాలు పట్టటానికి వీలులేకుండా చిక్కి సగమై పోయాడు. ఎప్పుడూ దిగులుగా పరధ్యానంగా వుంటాడు. మునుపు అతనిలో తొణికిస లాడే ఉల్లాసమంతా మటుమాయమయి పోయింది. దువ్వకోక పోవటంతో జుట్టంతా దుబ్బులాగుంది. గడ్డం పెరిగి అతని ముఖాన్నంతా కప్పివేసింది.

దుప్పటి ముఖం మీదినుంచి తీసి బరువుగా రెప్పలు పైకెత్తి "ఆఁ యేంలేదండి. బాగానే వుంది...." అని మళ్ళీ ముసుగు పెట్టుకున్నాడు. జీవిత సర్వస్వాన్నీ కోలుపోయినట్లు నిరాశా నిస్పృహ అతనిముఖంలో అలుముకు పోయినయ్. చూస్తుంటే అమ్మమ్మ మనస్సు ఎంతో బాధపడింది. సుందరి ఆయింట్లో వున్నన్నాళ్ళూ సారధి యెంత ఉత్సాహంగా వుండేవాడో! వాళ్ళిద్దరూ కేరింతలు కొడుతూ కళ్ళముందు మసలుతూవుంటే ఆవిడ మనస్సు పొంగి పోయేది. కాని యిల్లా జరుగుతుందని ఎన్నడూ అనుకోలేదు. సుందరికి పెళ్ళీడు వచ్చిందని తను తొందర చేసింది. అయినా చంద్రశేఖరం అమాంతంగా సుందరిని తమకి దూరం చేస్తాడని ఆవిడ కలలోనైనా అనుకో లేదు. ఈ మార్పు సుందరి జీవితంలో మంచికే దారి తీస్తుందనే ఆశతో తను అంగీకరించింది. సుందరి మంచికోసమే చంద్రశేఖరం ఈపని చేశాడని ఆవిడకి గట్టి నమ్మకముంది. కాని సుందరిని పుట్టి పెరిగిన కుదుటిలోంచి కూకటి వేళ్ళతో పెళ్ళగించి మూడంతస్తుల మేడ లోకి విసిరివేసే ముందు సారధి సంగతి యెవరూ ఆలోచించలేదు. ఇప్పుడు సారధిని చూస్తుంటే ఆవిడ గుండె చెరువై పోతోంది

"నాయనా! ఇవాళ నువ్వు డాక్టరుకి చూపించుకుని మందు తెచ్చుకోక పోతే నామీద ఒట్టే. పద, వెళ్ళిరా" అంటూ ఆవిడ సారథి పక్కలో కూచుని బతిమాలింది. "నా కెందుకండీ మందులూ?" అని మొండికేశాడు సారథి. కాని అంతకంటె మోరాయించి కూచుంది ఆవిడ. తప్పనిసరి అయేసరికి మెల్లిగాలేచి బయలు దేరాడు డాక్టరు చంద్రశేఖరంగారి యింటికి.

వచ్చే రోగులతో వెళ్ళేవాళ్ళతో ఇల్లంతా కిటకిట లాడి పోతోంది. తనవొంతు వచ్చేదాకా ఓపికగా బల్లమీద ఒదిగి గోడకి ఆనుకుని కళ్లు మూసుకుని కూచున్నాడు సారథి. కొమ్మల్లో కొన్నాళ్లుకమ్మగా పాడిన కోకిల ఎగిరపోయిన తరవాత కళలేని మామిడిచెట్టులాగా వుంది అతని హృదయం. సుందరి కోమల కరాంగుళుల స్పర్శకి పులకించి మధుర సంగీతాన్ని వెదజల్లిన అతని హృదయవీణ మూగదై మూల పడిపోయింది. ఎందుకల్లా తన గుండెని చీల్చివేసింది సుందరి? యెందుకు తననీరీతిగా వంచించింది? ఆకాశాన్నంటే శిఖరాలకి రెక్కలమీద తేల్చుకుపోయే ఆశచూపి నడిమధ్యలో ఎందు కిల్లా జారవిడిచి అగాధమైన అంధ కారంలోకి తోసివేసింది? దీనికంతకీ చంద్రశేఖరం కారకుడు కాడా? ఆయన చెప్పినంత మాత్రాన సుందరి ఎందు కొప్పుకోవాలి? అయినా సుందరికి తనమీద మనసు లేదేమో? ఆమె చూపులకి తను విలువలేని గడ్డిపరక యేమో? సుందరి తనని ఎంత నిర్లక్ష్యంగా చూసినా తనుమాత్రం హృదయమందిరంలో ఆమెని భద్రంగా నిలిపి మౌనంగా ఆరాధించటం మానలేక పోతు న్నాడు. మనసు మరలించుకోవాలని యెంత తపించినా సుందరి అనే ఇంద్రజాలంనించి అతను బైటపడలేక పోతున్నాడు.

"ఎవరు నువ్వు? ఏమిటి సుస్తీ?" అని చంద్రశేఖరం సారధి బుజాలు పుచ్చుకుని ఊపాడు. ఉలిక్కిపడి లేచి సారధి నమస్కారం చేశాడు.

"ఓరినీ! నువ్వా! గుర్తుపట్టలేక పోయాను సుమా? ఏమిటీ సుస్తీ? పద. ఆ గదిలోకి పోదాం" అని లోపలికి తీసుకు పోయాడు డాక్టరు చంద్రశేఖరం. కుర్చీలో సారధిని కూచోబెట్టి స్టెతొస్కోపుతో పరీక్ష చెయ్యబోయాడు. "వొద్దు. వొద్దు. నా జబ్బు దానికి దొరికేదికాదు. నా వ్యాధికంతకీ మీరే కారకులు" అని ఉద్రేకంతో కందిన ముఖంతో అరిచాడు సారధి. అతని కళ్ల ఎర్రజీరలు మెరిసినయ్. ఎంతో సౌమ్యంగా వుండే సారధిలో ఈ వుద్రేకం యెక్కడ దాక్కుందో చిత్రంగా వుంది.

విస్తుపోతూ "నేనా? నేనా?" అన్నాడు డాక్టరు.

"అవును మీరే. ముమ్మాటికీ మీరే? నా హృదయాన్ని ముక్కలు చేసేశారు. నా ప్రేమని భగ్నం చేసేశారు. నా సుందరిని దూరంచేసేశారు. నా సౌభాగ్యాన్ని నిలువునా దోచేశారు. దిక్కులేని బికారిని చేశారు నన్ను. బతికివున్న శవాన్నిచేశారు నన్ను. మీరే. మీరే!" అని ఉద్రేకంతో డాక్టరుగారి మెళ్లో వేళ్లాడుతున్న స్టెతొస్కోపు పుచ్చుకొని గుంజుతున్నాడు.

"తొందరపడకు. కూచో. నిదానంగా మాట్లాడుకుందాం. శాంతించు" అని భుజంమీద చెయ్యివేసి నిమిరాడు డాక్టరు. ఆయన ముఖంలో వెలిగే ప్రశాంతతని చూసి సారధి చప్పున చల్లారిపోయి సిగ్గుతో ఆయన కాళ్లమీదపడి "నన్ను క్షమించండి. మన్నించండి. ఊద్రేకంలో ఏదో అనేశాను" అని దీనంగా విన్నవించాడు.

అతన్ని మెల్లిగా లేవనెత్తి కుర్చీలో కూచోపెట్టాడు. క్షణం సేపు సారథికేసి తేరిపారచూసాడు. మనుషుల్ని పుస్తకాలలాగా చూపులతో చదివే నేర్పుంది చంద్రశేఖరానికి. "నాయనా! నువ్వు సుందరిని ప్రేమిస్తున్నావటోయ్!" అవునని తలఊపి నేలచూపులు చూడటం మొదలు పెట్టాడు సారథి.

"అయితే నాకిన్నాళ్లు ఎందుకు చెప్పలేదు? ఇంతకుముందే ఎందుకు చెప్పలేదు? నువ్వయినా చెప్పకపోయావా? సుందరి అసలీ సంగతే ఎత్తలేదు—" అని ఆందోళనతో, ఆలోచనతో అటూ యిటూ పచార్లుచేశాడు చంద్రశేఖరం. సారథి మౌనంగా కూచుండిపోయాడు.

"ఇప్పుడేం చెయ్యగలను? ముందే చెబితే ఎంత బాగుం డేది?" అన్నాడు డాక్టరు సారథి ముఖంలోకి చూస్తూ.

"అయితే సుందరి నాకిక గగన కుసుమమేనా" అన్నాడు. బాధతో సారథి.

"నేనేంచెప్పను నాయనా? నాశాయశక్తులా ప్రయత్నిస్తాను" అన్నాడు డాక్టరు చంద్రశేఖరం.

"మీరేం బాధపడకండి డాక్టరుగారూ! సెలవివ్వండి వెళ్లొస్తాను" అని లేచి బరువుగా వెళ్లిపోయాడు సారథి. ఆ వెళ్లిపోతున్న మనిషికేసి చూసేసరికి చంద్రశేఖరం మనస్సు చివుక్కుమంది. తనకి తెలియకుండా ఈ యువక హృదయంలో ఎంత దావానలం రగిల్చాడు? అయినా సుందరి తనతో మాట మాత్రమైనా ఎందుకు చెప్పక పోవాలి? అప్రయత్నంగా చంద్రశేఖరం కళ్లలో నీళ్లు చిందినయ్. సుందరి జీవితానికి అమృతం అందించానని ఇన్నాళ్ల నుంచీ ఆనందిస్తున్నాడు. కాని సారథికి హాలాహాలంకూడా తనే అందించినట్లయింది. మనస్సంతా చికా

కుతో, బాధతో నిండిపోయింది. మంచికి చేశామనుకునే పనులలో కూడా చెడు వెన్నంటి వస్తూనే వుంటుంది. అసలు మంచిచెడ్డలు రెండూ కలగా పులగంగా విడదీయటానికి రాని అల్లిబిల్లి అల్లికగా చిక్కుపడి వుండటమే జీవితంలో సత్యమనిపిస్తుంది. ఇప్పుడు తనేం చేయ్యాలి ? ఈ ప్రేమికుడి గతియేమిటి ? సుందరి సంగతి ఏమిటి ? అని ఆలోచిస్తుండగా కారు దిగి వచ్చింది మాధురి. ఆమె ముఖమంతా వాడిపోయింది. ఆమె రూపమంతా ఏదో కారు మబ్బు ఆవరించినట్లుగా వుంది.

"ఏమమ్మా ! అల్లాగున్నావ్" అని అడిగాడు డాక్టరు.

"కొంచెం జ్వర భారంగా వుంది. అంతే. ఇంకేంలేదు" అంది మాధురి. స్వయంగా మందు కలిపి ఇచ్చాడు బాబాయి. అక్కడే ఒక డోసు తాగింది. "వెళ్లొస్తాను బాబాయ్ ! మొన్న సుందరి సంగతి చెబుతా నన్నావు గుర్తుందా ?" అంది మాధురి కుతూహలంగా.

"అవునమ్మా గుర్తుంది. కాని ఇవాళకాదు. సమయం వచ్చి నప్పుడు నేనే చెబుతాను" అనేసరికి మాధురి లేచింది. సుందరివల్ల నీకేమైనా బాధకలుగుతున్నదా అని అడుగాలనుకున్నాడు. ఆ ప్రశ్న కంఠంలో వుండగానే మాధురి అక్కడి నుంచి వెళ్లిపోయింది. మనసులో కొండంత బరువు మోస్తున్న మనిషిలాగా కనిపించింది మాధురి. కాని నోరు విప్పి రెండో మనిషికి తన బాధ చెప్పుకునే స్వభావం కాదు ఆమెది. అల్లా మౌనంగా వెళ్లిపోయిన మాధురి కేసి చూస్తుంటే చంద్రశేఖరం మనస్సు పరిపరి విధాలుగా పరి గెత్తింది. తనకి తెలియకుండానే నిట్టూర్పు విడిచాడు. అయోమ యంగా వున్న ఆకాశంలోకి చూస్తూ నిలబడి పోయాడు.

* * * *

కిటికీలోంచి తోటలో కొబ్బరి చెట్లు వెన్నెట్లో స్నానాలుచేసి తలలు ఆరబెట్టు కుంటున్నట్లు కనిపిస్తున్నయ్. కొబ్బరి మట్టలమీద శరత్కాలపు వెండి వెలుగులు పాదరసంలాగా జారిపోతున్నయ్. ఆ వెన్నెలని తాగి మత్తెక్కిపోయినట్లు తెల్లమబ్బులు కదలకుండా అక్కడక్కడా ఆకాశంలో నిలబడిపోయినయ్. ఆ వెన్నల గిలి గింతల్లో లోకమే విప్పారిన తెల్లకలవలాగా పులకించి పోతున్నది. హృదయాన్ని సముద్రంలాగా వరవడి తొక్కించే సంగీతం విని పిస్తోంది రేడియో. హాలులోనే మాధురి ఎంతోసేపు అటూ ఇటూ పచార్లుచేసింది. నిలువుటద్దాలలో ఆమె పలచటి తెల్లచీరె, ఆ చీరె లోంచి తొంగిచూసే శరీరపు బంగారపు కాంతులు, కాటుక రేఖ లతో సోగలు తేరిన మెరిసే కళ్లూ మనోహరంగా ప్రతిబిం బిస్తున్నయ్. ఆ రాత్రే ఆరేళ్ల క్రిందట మధూ, మాధురీ జీవిత సుధని మొదటి మాటు ఆస్వాదించారు. ఇంతవరకూ ప్రతియేటా ఆ రాత్రి సంగతి ఆ దంపతులు మరిచిపోలేదు. జాజి పూలదండతో రాత్రి మధుని అలంకరించేది. మధుకూడా మాధురి మెళ్లో దండ వేసి గడచిపోయిన మధుర క్షణాలని నెమరువేసుకునే వాళ్లు. ఇవాళకూడా అందుకోసమే మాధురి ప్రత్యేకంగా అలంకరించు కుంది, వెండి పళ్లెంలో జాజిపూల దండలు వాసనలు వెదజల్లు తున్నయ్. మనస్సు ఎంతో ఆత్రంగా యెదురుచూస్తోంది. ప్రతీక్ష బరువుతో గుండెలు కొట్టుకుంటున్నయ్. భర్త ఆ సంగతే మరచి పోయాడా? ఏటా ఆ రాత్రి యెంత ఉల్లాసంగా వుండేవాడో!

ఎంత సేపటికి సుందరి కిందికి దిగిరావటంలేదు. మేడమీద గదిలో పాటలకీ, మాటలకీ, నవ్వులకీ అంతు కనబడటంలేదు. మాధురి హృదయం మండిపోతుంది. యాచకురాలుగా తన అండన చేరిన సుందరి తన ఆనందానికీ, సుఖానికీ ఎంత అంత

రాయంగా, అవరోధంగా తయారయింది? ఈ నిర్భాగ్యురాలిని దగ్గరికి తీసి తన చేతుల్తోనే తన సౌఖ్యదామానికి చిచ్చు పెట్టు కున్నట్లయింది! ఇంకెంత కాలం ఓపికపట్టి ఊరుకోవటం? ఇంత మాత్రం సుందరి యెందుకు గ్రహించలేదు? తెలియక ఇలా ప్రవర్తిస్తోందా? కావాలని తన అధికారాలన్నీ ఒక్కొక్కటే ఇలా తన చేతుల్లోంచిగుంజుకుంటున్నదా? తనఇంట్లో తనే పరాయిదయిపోయిందా? ఈ రోజున అసలీ సుందరికి ఈ యింట్లో యేం స్థానముంది? తను ఎంతలో వుండాలో అంతలో యెందుకుండదు సుందరి? ఏమైనా సరే సుందరి ఆటలు ఇంతటితో కట్టిం చెయ్యాలి. కారు చిచ్చులాగా రగులుతున్న అక్కసుని అణుచుకుంటూ మాధురి 'సుందరీ!' అని కేకపెట్టింది. మారులేదు.

పూలదండల వెండిపళ్ళెంతో మాధురి మేడమీదికి నడిచింది. చప్పుడు చెయ్యకుండా కొండకొనలమీద పాకిపోయే మబ్బుల నీడ మాదిరిగా గదిదగ్గరికి వెళ్ళింది. తెలియకుండానే మాధురిచేతుల్లో పళ్ళెం పట్టుతప్పి ధన్‌మని కింద జారిపడింది. దండలు రెండూ దొర్లాడుతున్నయ్.

మధు చేతిలో కుంచె కిందపడిపోయింది. అతను గీస్తున్న ఊర్వశి ముఖంమీద ఎర్రరంగు చుక్కలు చిందినయ్. మామిడి చెట్టుని అల్లుకునే మాధవీ లతలాగా అతని చేతులతో పెనవేసుకుని మధు హృదయంలో ముఖందాచుకున్న సుందరి ఉలిక్కిపడిలేచింది. ఏదో స్వప్నంలోంచి ఒక్క కుదుపుతో మేలుకున్నట్లయింది.

పూర్ణిమ రోజున ఉదయించే సమయంలో చంద్రబింబం మాదిరిగా అరుణకాంతులతో మాధురి సౌమ్యవదనం భయానకంగా వెలిగింది. మధు వంచిన తల యెత్తలేకపోయాడు. సుందరి క్షణంసేపు యేం చేయాలో తెలియక తన్నుకుని గబగబా కిందికి

వెళ్ళబోయింది. దారికి అడ్డంగా నిలబడి మాధురి "ఆగు" అంది. ఆ తీవ్ర స్వరానికి సుందరి బెదిరింది. బిత్తర చూపులతో మధు కేసి, మాధురికేసి చూస్తూ నిలబడింది.

"బికారీ! ఇంట్లో తిని ఇంటి వాసాలు లెక్కపెడుతున్నావా? జాలి తలిచి చేరదీస్తే నా సర్వస్వానికీ చిచ్చుబెట్ట దలచావా? విశ్వాసఘాతకీ! నడు ఈ క్షణమే బైటికి నడు. నీ ముఖం నాకిక చూపించకు. ఫో" అంది మాధురి దడదడ కొట్టుకుంటున్న గుండెలతో వొణికిపోయే కంఠంతో. ఆ క్షణంలో సుందరిని నిలువునా మింగేసేటంత ఆగ్రహం మాధురి గుండెల్లో నాలుకలు జాపుతోంది.

క్షణంసేపు వెలతెలవోయిన సుందరి బిగ్రబిగిసింది. "నువ్వెవరివి నన్ని యింట్లోంచి వెళ్ళమనటానికి? నేను బికారిని కాను. నాకూ ఈ యింటిమీద అధికారముంది" అంది సుందరి.

"ఈ యిల్లు నాది. నా యిష్టం లేకుండా నువ్విక్కడ నిమిష మైనా వుంటానికి వీల్లేదు. వెళ్ళు. పైగా నీకు అధికార ముందని పేలుతున్నావా? వొళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడు. కళ్ళు నెత్తి కొచ్చి నీకు కిందూమీదూ కానరావటం లేదు. ముందు బైటికి నడుస్తావా, మెడపట్టి గెంటించమంటావా?" అని మాధురి రెండడుగులు ముందుకు వేసింది.

సుందరి అక్కణ్ణుంచి కదలలేదు. తొణుకూ బెణుకూ లేని కంఠంతో "అక్కా! ఈ యింటిమీద నీ కెంత అధికారముందో నాకూ అంతే వుంది. నువ్వు పొరబడుతున్నావు. నేను బికారిని కాను" అంది.

"ఎవరిచ్చారు నీకీ అధికారం?"

"నీ కెవరిచ్చారో నాకూ వారే."

"అంటే?—"

"అంటే యేంలేదు. నేను నీ చెల్లెల్ని."

"ఛీ! నువ్వా? అసంభవం. నేను నమ్మను."

"రుజువు చేస్తాను. నువ్వేకాదు, ఎవరైనా నమ్మితీరవలసిన ధాఖలాలు చూపిస్తాను."

"నిరూపిస్తే ఈ నిమిషమే నా సర్వస్వమూ నీ కప్పగించి నేను దూరంగా తొలగిపోతాను. ఋజువు చెయ్యలేకపోతే నిమిషం కూడా నువ్వీయింట్లో వుండటానికి వీల్లేదు."

"మాట తప్పవుకదా?"

"అల్లా ఎన్నటికీ జరగదు."

"అయితే పద. నాతో రా" అంది సుందరి. ఇద్దరూ శర వేగంతో అక్కణ్ణుంచి వెళ్ళిపోయారు.

వీళ్ళిద్దరి సంభాషణా మధుచెవిలో దూరనేలేదు. సిగ్గుతో నేలలో అణగారిపోతున్నట్లుగా వుంది. ఒకచేత్తో అమృతకలశం ఇంకోచేత్తో విషభాండం పుచ్చుకొని కల్లోల సాగరంలో అవతరించిన ఊర్వశి జగన్మోహన రూపాన్ని చిత్రిస్తున్నాడు. ఇంకొంచెం సేపట్లో చిత్రం పూర్తి అయిపోయేది. ఇంతలో ఈ సంక్షోభం. ఊర్వశి ముఖమంతా ఎర్రరంగు డాగులు పడి వికృతమైపోయింది. ఊర్వశి చాటునుంచి సుందరి ముఖమే అతనికేసి పరిహసిస్తూ చూస్తున్నట్లుగా వుంది. ఆ తళుకుచూపులు సుందరివే! ఆ ముగ్గియని చిత్తరువుకేసి మూగగా చూస్తూ అల్లాగే నిలబడిపోయాడు మధు.

అక్కణ్ణుంచి సరాసరి చంద్రశేఖరం గారింటికి వెళ్లి ఆయన్ని లేపారు. అర్ధరాత్రి సుందరీ మాధురీ రావటం చూసి నిర్ఘాంత పోయాడు. "నిజం చెప్పు బాబాయ్. ఈ సుందరి ఎవరు? ఇవాళ నువ్వు చెప్పితీరాలి" అంది మాధురి ఆవేశంతో.

ఆ తీవ్రస్వరం విని చంద్రశేఖరం చకితుడయ్యాడు. ఏదో ఉపద్రవం జరిగి వుండాలని వూహించాడు.

"చెబుతానమ్మా. కూచోండి" అని ఇద్దరినీ తన మంచం మీద కూర్చోబెట్టుకున్నాడు.

"సుందరి పరాయిపిల్ల కాదమ్మా. నీ చెల్లెలు. దైవసాక్షిగా చెబుతున్నాను. నమ్ము" అన్నాడు.

"నాకేం తెలియటంలేదు బాబాయ్. ఇదెల్లా సంభవం?" అంది మాధురి ఆశ్చర్యంతో.

"మా ధనంజయం అన్నయ్య యెన్నో దానాలు చేశాడు. గొప్ప పేరు సంపాయించుకున్నాడు. ఒక వితంతు శరణాలయాన్ని కూడా నెలకొలిపాడు" అని గొంతు సవరించుకున్నాడు.

"అయితే దానికీ దీనికి సంబంధమేమిటి?" అంది మాధురి చిరాకుగా.

"అయనకి చివరిరోజుల్లో ఒక అనాథయువతితో సంబంధం ఏర్పడింది. ఆమెని పెళ్లాడుతానని మాట యిచ్చాడు. కాని తను యింతకాలం సంపాయించిన పేరు పోతుందనీ, సంఘం దుయ్యబట్టుతుందనీ వెనకాడాడు. ఆ అనాథ కొన్నాళ్లకి ఈ సుందరిని ప్రసవించి నా ఆసుపత్రిలోనే మరణించింది. ఈ పిల్లని నాకు అప్పగించి వెళ్లింది. కూతురు ముఖం చూడని తల్లి చివరికి కూతురు పోయాక వచ్చి ఈ పసికందుని తను పెంచుతానని తీసుకువెళ్లింది. వాళ్ల అమ్మమ్మ దగ్గర సుందరి పెరుగుతూవుంది."

మాధురి ముఖం వెలవెల బోయింది. తడి ఆరిపోయింది.

"ఆ తరవాత అన్నయ్య ఎంతో బాధ పడ్డాడు. పోయే ముందు ఈ రహస్యం నాకు చెప్పి బరువు తగ్గించుకున్నాడు. ఆ పిల్లకి ఏ లోటూ రాకుండా చూడమని ఆదేశించాడు. ఆయన

చివరి కోరిక ప్రకారమే నేను సుందరిని మన యింటికి తీసు కొచ్చాను. ఇక మీదట నీదే భారం తల్లీ! ఇది పరాయిపిల్లకాదు. నీ చెల్లెలు" అని ముగించాడు చంద్రశేఖరం.

"ఋజువు చేశానా? తృప్తి కలిగిందా? ఇంకా నమ్మకం కలగలేదా?" అంది సుందరి హేళనగా.

మాధురి మాట్లాడలేకపోయింది. గొంతుకి ఏదో అడ్డుపడి నట్లనిపించింది. తండ్రిగారికి అపర వయస్సులో కలిగిన మదన వికార ఫలితమే యీసుందరి....తన చెల్లెలే....కాని మంచివాడుగా గొప్పపేరు సంపాయించిన తన తండ్రి ఇటువంటి పని చేశాడా?

"అయితే ఈ సంగతి ఎందుకు వెల్లడించలేదు బాబాయ్" అంది తీవ్రంగా మాధురి.

"ఈ కళంకాన్ని వెల్లడించటం ఎందుకు తల్లీ? సమయం వచ్చినప్పుడు చెబుదామని వూరుకున్నాను. ఈ రహస్యం భద్రంగా వుంచండి" అన్నాడు డాక్టరు.

మాధురి కళ్లముందు లోకమంతా ఒక్కసారి తారుమారయి నట్లు తోచింది. అంతా ఏదో మసకగా అలికివేసినట్లయి పోతోంది.

"ఇంక వెళ్దామా?" అంది సుందరి.

"పద" అని మాధురి లేచింది. దారిలో ఎవరూ మాట్లాడ లేదు. సుందరి ముఖాన విజయగర్వం తాండవిస్తోంది. మాధురి తల ఎత్తి చూడలేక తనలోకి తను కుంచుకు పోతోంది.

తెల్లవారిలేచి చూసేసరికి మాధురి జాడలేదు. ఎక్కడికి వెళ్లిందో తెలియదు. ఏమయిందో తెలియదు. గదిలో బల్లమీద ఆస్తినంతటినీ సుందరికి ఇచ్చేస్తూ అధికారపత్రం రాసిపెట్టి వెళ్లి పోయింది.

అమ్మగారు కనబడలేదని నౌకర్లంతా గగ్గోలు చేశారు. ఈ కబురు విని మధు పిడుగు దెబ్బతిన్న చెట్టులాగా కూలి పోయాడు.

* * * *

"నీకు తెలియదా సుందరీ! నీతో చెప్పలేదా?" అని మధు దీనంగా అడిగాడు. అతని జుట్టంతా చెదిరిపోయింది. సామ్రాజ్యాన్ని కోలుపోయిన చక్రవర్తి ముఖం లాగా వుంది మధు ముఖం.

"నాకు తెలియదు బావా. తెలిస్తే చెప్పనా?" అంటూ సుందరి అతనిజుట్టును వేళ్లతో సవరిస్తూ చెప్పింది. ఏదో ఆనందం సుందరి ముఖంలో మెరిసిపోతోంది.

"నిజం చెప్పు సుందరీ! నన్ను చంపకు" అన్నాడు.

"ఎంత మాటన్నావు బావా! ఛీ అల్లాంటి పాడు మాట లంటే నే నూరుకోను" అని మధు పెదవులమీద తన చెయ్యి పెట్టింది విలాసంగా. మధు విదిలించుకొని ముఖం తిప్పేసుకుని దూరంగా జరిగాడు.

"ఎక్కడికి వెళ్లిందో నాకు తెలియదుబావా! నా మాట నమ్ము. అయినా నీకింత విచారం దేనికి? ఆ బికారి యెక్కడికి పోతే మనకేం? తన సర్వస్వాన్ని నాకు అప్పగించేసి ఉత్తచేతుల్తో బిక్షుకురాలులాగా వెళ్లి పోయింది."

కొరడాదెబ్బ తిన్నట్లు త్రుళ్లిపడి లేచాడు మధు. "నిజం గానా?" అన్నాడు ఆవేశంతో.

"అవునుబావా! ముమ్మాటికీ నిజం. ఇదిగో అధికార పత్రం, కావలిస్తే నువ్వే చదువుకో—" అంటూ దగ్గిరగా వెళ్లి మధుని కోమలబాహువులతో చుట్టేసింది.

"నిన్ను ఈ కౌగిట్లో బందీని చేస్తానుబావా! ఎక్కడికీ కదలనివ్వను. ఇంక మన ప్రపంచంలో నువ్వూ నేనూ ఇద్దరమే. మన మిద్దరమే—" అని విలాసంగా కళ్లు తిప్పింది సుందరి.

విసురుగా ఒక్కతోపు తోశాడు మధు. తూలిపోయి గోడకి కొట్టుకుంది. "వెళ్తున్నాను. నేనూ వెళ్తున్నాను. మాధురి దొరికితే గాని తిరిగి రాను. మాధురిలేని జీవితం చంద్రుడులేని ఆకాశం" అంటూ చరచరా వెళ్లిపోయాడు మధు. సుందరి యౌవనమూ, విలాసమూ, ధనమూ ఇవేమీ అతని దారిని అడ్డగించలేక పోయినై. దెబ్బతిన్న అభిమానంతో పొంగివచ్చే కన్నీళ్ళని ఆపుకుంటూ సుందరి ఇల్లంతా కాలుకాలిన పిల్లిలాగా తిరిగింది.

నౌకర్లంతా తలొకదారే వెళ్లిపోయారు. ముసలమ్మ కోడలు మాయమవటం గురించి ఏమిటో గొణుగుతోంది. గోడ గడియారము బరువుగా టిక్ టిక్ మని ఆడుతున్నది. ఇల్లంతా బావురు మంటోంది. సుందరి తల తిరిగిపోయింది. మధు తనని ఇల్లా దులపరించుకుని వెళ్లిపోతాడని కలలోగూడా అనుకోలేదు. ఆ మూడంతస్థుల మేడలో ఒంటరిగా బిక్కు బిక్కుమంటూ గడపటం ఎల్లాగు? ఇప్పు డీ మేడా, తోటా, డబ్బూ, అన్నీ తనవే. కాని అవన్నీ సముద్రంలో ఉప్పునీళ్లులాగాచుట్టూ పరుచుకుని వున్నప్పటికీ తన కేం లాభం? తన లోపలి తృష్ణ ఎల్లా తీరుతుంది? మాధురి వెళ్లిపోయింది. మధుకూడా వెళ్లిపోయాక ఇల్లంతా పాడుపడి నట్లుంది. ఈ యిల్లు తనని నోరు తెరుచుకొని అమాంతం మింగటానికి పూనుకునే పెనుభూతంగా వుంది. అక్కణ్ణుంచి పారిపోవాలి. దూరంగా పారిపోతేకాని మనస్సులో మంట చల్లారదు. గుండెల్లో అలజడి అప్పటికా్కని అణిగేట్లు లేదు.

అధికారపత్రం చేతపుచ్చుకుని తరుముకువచ్చే క్రూర మృగంనుంచి తప్పించుకునే లేడిలాగా పరుగెత్తింది సుందరి శర వేగంతో. అమ్మమ్మయింటికి చేరుకుంది. తలుపు తాళం వేసివుంది. ఆ కిందటిరోజున ఆవిడ ఏదోవూరు యాత్రలకి వెళ్లిందట. తనతో చెప్పనైనాలేదు. తను దిక్కులేని దీనురాలై ఒంటరిగా తోడు లేకుండా నిలబడిపోయింది. ఆక్రోశంతో వణికిపోయింది. "ఇంత ధనానికి అధికారినయాను. నా కెవరూ లేరా ? నేను దిక్కులేని పక్షినా ?" అనే ఆవేదనతో సుందరి కళ్లు తడిసిపోయినయ్.

వాకిట్లో ఏదోబండి నిలబడి వుంది. పక్క గదిలో ఏదో అలికిడి వినిపిస్తోంది. సారథి సామానంతా సర్దుకున్నాడు. "ఎక్కడికో ప్రయాణం" అంది సుందరి వెనకగా వెళ్లి, ఉలిక్కిపడ్డాడు సారథి. తన కళ్లని తనే నమ్మలేకపోయాడు.

"వెళ్తున్నాను" అన్నాడు. కనుగొనలలో నీళ్లు తొణికినయ్.

"ఎక్కడికి ?" అంది సుందరి ఆందోళనతో. "నాకు తెలియదు. ఎక్కడికో. ఈ కాళ్లు ఎక్కడికి నడిస్తే అక్కడికి" అని విరక్తిగా అన్నాడు.

"వీల్లేదు. వెళ్లనివ్వను. నిన్నిక్కణ్నుంచి కదలనివ్వను. ఆ బండిని తిప్పి పంపించెయ్యిముందు."

బండి వెళ్లిపోయింది. ప్రయాణం ఆగిపోయింది. "నన్నెందుకు ఆపుచేశావు సుందరీ ?"

"ఎందుకా ? అందరూ నన్ను వొదిలేసి వెళ్లిపోతే నేనేమయి పోతాను చెప్పూ ?" అని బాధగా అంది సుందరి.

ఇవాళ దారితప్పి వచ్చినట్లున్నావే ? నే నింకా గుర్తున్నానా సుందరీ? బంగారపు పంజరంలోంచి యెలా తప్పించుకు వచ్చావో?"

"సరియైన దారి ఏదో ఇవాళే తెలిసింది. నిన్ను వెతుక్కుంటూ వచ్చాను సారథీ!"

"బంగారపు పంజరంలోకి మళ్లీ వెళ్లటానికే వచ్చావా?"

"కాదు. కాదు. ఇక నిన్ను విడిచి స్వర్గానికైనా వెళ్లను. తెలిసిందా?" అంటూ నవ్వింది సుందరి. ఆమె దుర్బలహృదయం ఇన్నాళ్లకి సారథి దగ్గరికి యెగిరి వచ్చింది.

"పోదాం పదం. మనిద్దరి జీవితాలూ సిరిసంపదలతో భోగ భాగ్యాలతో తులతూగే వరాన్ని ప్రసాదించింది, ఇదిగో ఈ అధి కార పత్రాన్ని భద్రంగా దాచు" అని కాగితాన్ని అందించింది.

మాధురి ముత్యాల కోవలాటి అక్షరాలతో వున్న ఆ కాగి తాన్ని సారథి చకచకా చదివేశాడు. చదవగానే పట్టలేనిసంబరంతో యెగిరి గంతేస్తాడని సుందరి ఆశపడింది. కాని సారథి ముఖం అమాంతంగా మారిపోయింది. అతని వాణికే వేళ్లలోంచి ఆ కాగితం కింద జారిపోయింది.

"అయితే నన్ను వెళ్లిపోనీ సుందరీ" అన్నాడు సడలని నిశ్చయంతో.

"ఏం? ఎందుకూ! నేనేం తప్పుచేశాను?" అని దీనంగా అడిగింది సుందరి.

"మన ప్రేమని బంగారపు గొలుసులతో బందీని చేస్తావా? నేను ఒప్పుకోను. అలా ఎన్నటికీ జరగదు."

"అయితే నన్నిప్పుడేం చెయ్యమంటావు సారథీ!"

"ఇన్నాళ్లూ ఈ ధనమే మనిద్దరినీ ఎడం చేసివేసింది. ఆ ధనంతో మన ప్రేమని మలినం చెయ్యకు సుందరీ?"

"నీ వుద్దేశ మేమిటో తెలిసేట్లు చెప్పు."

"నీకు నేనో, ఈ ధనమో ముందు తేల్చుకో సుందరీ! దారిద్ర్యాన్ని వరించదలచుకుంటేనే నాదగ్గరికి రా. లేకపోతే నీ ధనం నీకు చాల మంచి వరులనే కొనిపెడుతుంది. వెళ్లు. నన్ను వెళ్లిపోనీ. దారి విడూ" అని సారథి కరుకుగా అన్నాడు.

క్షణంసేపు సుందరి అయోమయంలో పడి గిజగిజ తన్నుకుంది. ఎటూ తెగటం లేదు మనస్సు. ఒకసారి సారథి ముఖంలోకి తొంగిచూచింది. తన జీవితాన్నంతటినీ కాంతి దీపంచేసే వెలుగు అతని కళ్లలో దేదీప్యంగా వెలుగుతూ కనిపించింది. తన భావిభారమంతా సంతోషంతో వహించగల నిబ్బరం, అభయం అతని ముఖంలో స్ఫుటంగా కనిపిస్తున్నయ్. సుందరి హృదయం పూర్వ స్మృతుల మధురిమతో పులకరించింది.

అధికార పత్రాన్ని రెండు చేతులతోనూ చింపి ముక్కలు చేసింది. కొండంత బరువు దించినట్లుగా గుండెలు కొట్టుకుంటున్నయ్. "ఇక పద పోదాం" అంది సుందరి. ఆమె చేతిని తన చేతులలోకి తీసుకుని "ఎక్కడికీ?" అన్నాడు సారథి.

"ముందు బాబాయ్ ఆశీర్వచనం పొందాలి. పద, ఆ తరవాత ఆలోచిద్దాం." అంటూ సుందరి ముందుకి నడిచింది.

* * *

గమ్యంలేని గమనం, దూరం తెలియని పయనం, ఒంటరి తెరువరి, మాధురి దెబ్బతిన్న అభిమానంతోబయలుదేరింది. సుందరి తనకి చేసినద్రోహం మాధురి మనస్సుని దహించివేస్తోంది. ఆరేళ్ల దాంపత్యంలో అరమరికలు లేకుండా అనురాగమూర్తిగా తనకి అమరసుఖాన్ని చవిచూపించాడు మధు. అటువంటి మధు సుందరి బాహువులలో బందీ అయిపోవటం కళ్ళారా చూసిన మాధురికి లోకమంతా మోసంగా తోచింది. ప్రపంచం కళ్ళముందు చాపలాగా

చుట్టలు చుట్టుకు పోతున్నట్లు తోచింది. ఈ మోసంలోంచి బైట పడాలనీ, ఈ వ్యూహంలోంచి దూరంగా పారిపోవాలనీ ఆమె మనస్సు ఆరాటపడింది. మధు ప్రవర్తన ఆమెహృదయంలో పదునైన కత్తిపోటుగా దిగిపోయింది. అమృతపాత్రవంటి ఆమె కాపురంలో సుందరి విషబిందువులు చల్లింది. కూలిపోయిన ఆశలతో విరిగిపోయిన మనస్సుతో నడుస్తోంది మాధురి. పుట్టినదగ్గర్నుంచీ ఎండముఖం ఎరుగని కోమలి. అరికాలు కిందమోపితే అరిగిపోయే ఆగర్భశ్రీమంతురాలు. నడుస్తుంటే పాదాలు బొబ్బలెక్కి నెత్తురు చిమ్ముతున్నయ్. ముఖమంతా జేగురు ముద్దయింది. గుండె దడదడలాడి పోతున్నది. గొంతుతడి ఆరిపోతున్నది. ఆగలేదు. పళ్ళబిగువున నడవగలిగినంత దూరం సాగిపోయింది. అందరికి దూరంగా, నా అనేవారెవరూ కనిపించని చోటికి పారిపోతేనేగాని మాధురి మనస్సు కుదుటపడేటట్లు లేదు.

ఇక నడవలేక పోయింది. లోపల్నుంచి ఆకలిజ్వాల. ఒళ్లంతా అలసటతో పట్టు తప్పిపోతోంది. మసగచీకటి పడింది. ముడుచుకుంటున్న పద్మాలతో, విచ్చుకుంటున్న కలువలతో నీలంగా మెరుస్తున్న చెరువు కనిపించగానే మాధురి ప్రాణం లేచివచ్చింది. లోకపు మోసంతో రోసిన మాధురి మనస్సుకి ఆ చల్లటి నీళ్ళస్పర్శ కన్నతల్లి ఓదార్పుమాదిరిగా వుంది. అలలమీద ఉయ్యాలలూగుతున్న జాబిల్లిరేక మాధురి గుండెల్లోకి దూసుకుపోయేట్లుగా నవ్వుతున్నది. చెరువుగట్టున వేపచెట్టూ రావిచెట్టూ చిరకాలపు దాంపత్య శోభతో చల్లటి నీడలతో బాటసారులకి ఆతిథ్యం యిస్తున్నయ్. వాటినీడలో ఒక మంటపం నాలుగు స్తంభాలతో కనిపించింది. బూరుగదూది పరుపులమీద హాయిగా శయనించే మాధురి ఆ మండపంలో కటికనేలమీద వాలి కళ్లు మూసుకుంది. అది నిద్రో,

మూర్ఛో, మృత్యువో తెలియకుండా ప్రాణం ఎక్కడికో రెక్కలు కట్టుకుని ఎగిరిపోయింది.

తెలివి వచ్చి చూచేసరికి మాధురి నివ్వెరబోయింది. తను ఏ లోకంలో వున్నానా అని చుట్టూ ఆశ్చర్యంతో కలయజూసింది. తన తల మధు ఒడిలో వుంది. తన ముఖంమీద చల్లటి నీళ్లు చల్లుతూ ఉత్తరీయంతో విసురుతున్నాడు మధు. మండుటెండలో వసివాడిపోయిన తెల్లకలువల్లాగా వున్న మాధురి ముఖంచూస్తుంటే కడుపు తరుక్కుపోతుంది. ఆ కోమల హృదయం ఎంత భరించలేని బాధతో అలమటిస్తున్నదో? దీని కంతకీ తనేకదా మూలం? సిగ్గుతో మధు గొంతు పెగలటంలేదు. హృదయంలో మటుకు చెప్పలేని ఆరాటం తొందర పెడుతోంది. మాధురి ముఖంమీదికి చెదిరిన ముంగురులని సవరిస్తూ "నన్ను మన్నించవా మాధురీ? నన్ను క్షమించు. ఇంటికి పోదాంపద. నిన్ను విడిచి నేను క్షణం కూడా వుండలేను. నువ్వు రాకపోతే నేనూ నీ వెంట వస్తాను. ఇంటికి తిరిగి వెళ్లను. మాట్లాడవేం మాధురీ?" అన్నాడు మధు ఆవేదనతో.

మాధురి మౌనం చళుక్కున కొరడాతో చరిచినట్లుగా తగిలింది మధు హృదయానికి. మాధురి అతన్ని యెన్ని మాటలు అన్నా అతని హృదయం అంత గిలగిల తన్నుకొనేది కాదు.

మాధురి చేతులని తన వేళ్లతో నిమురుతూ "మాధురీ! నేనేం దేవతనా చెప్పూ? తప్పులు చెయ్యకపోవటానికి రాయినా రప్పనా? నేను మనిషిని. మనుషులుచేసిన వాటిని మనుషులే క్షమించకపోతే యెలాగు మాధురీ?

"నేనూ మనిషినే మరి. కోపం తెచ్చుకొని తొందరపడి వచ్చేశాను. నన్ను మన్నించు ముందు" అంది మాధురి భర్త కళ్లలోకి చూస్తూ అతని కన్నీళ్లని చెంగుతో తుడిచి వేస్తూ.

"ఇంక పద మరి" అని మాధురికి చెయ్యి ఊతయిచ్చి లేవ దీశాడు. మళ్లీ ఆ చెయ్యి యెక్కడ జారిపోతుందో అని మాధురి గట్టిగా పట్టుకుంది. "ఈ బంధాన్ని మృత్యువుకూడా విడదీయ లేదు మాధురీ" అన్నాడు మధు కారులోకి యెక్కుతూ.

బాణంలాగా దూసుకుపోయింది కారు. ఇట్టే వొచ్చేసింది ఇల్లు. మూడంతస్తుల మేడముందుఆగింది.మాధురి మధూ దిగేసరికి అంతా పరుగెత్తు కొచ్చారు. సుందరీ, సారథీ, చంద్రశేఖరం ఆత్రంగా కారు దగ్గరికి వొచ్చారు. బాబాయి చేతుల్లోకి వాలి పోయింది మాధురి. ఆమె పాదాలమీద చాపచుట్టగా పడిపోయింది సుందరి. నోట్లోంచి మాట పెగలలేదు. వెక్కివెక్కి ఏడుస్తూ మాధురి పాదాల్లో ముఖం దాచుకుంది.

మెల్లిగా లేవనెత్తి మృదువుగా సుందరి గడ్డాన్ని ముని వేళ్లతో పైకెత్తి "ఎందుకు సుందరీ?" అంది. మాధురి కంఠ స్వరంలో కోకిల కూస్తోంది. కళ్లలో శరత్కాలపు వెన్నెల మెరుస్తోంది. ఎక్కడా కోపపు నీడలే కనిపించటంలేదు.

"నన్ను క్షమించవా అక్కా?" అంది దీనంగా.

"దేనికమ్మా?" అని ప్రేమతొణికే స్వరంతో అంది మాధురి.

"నాకే అధికారమూ అక్కర్లేదు. నన్నిలా వెళ్లిపోనీ, అక్కా! నేను దరిద్రంలో పుట్టి పెరిగాను. దారిద్ర్యాన్నే వరిం చాను. మమ్మల్ని దీవించు అక్కా! ఇంతకంటె నాకే సిరి సంప

దలూ అక్కర్లేదు" అంటూ సారథిని చెయ్యిపుచ్చుకుని ముందుకు పిలిచి యిద్దరూ మాధురికి వంగి నమస్కారంచేశారు.

ఇద్దరినీ లేవనెత్తి మాధురి వాళ్లిద్దరి మీదా ఆశీస్సులు కురిపించింది.

మధు మౌనంగా తలవంచుకుని నిలబడిపోయాడు. నాటకం మధ్యలో వచ్చి కథ అర్థంకాని ప్రేక్షకుడులాగా చంద్రశేఖరం గంభీరంగా నిలబడి చూస్తున్నాడు. సారథి పొంగిపోయే హృదయంతో భూమికీ ఆకాశానికీ ఉయ్యాలవేసి ఊగుతున్నాడు.

వీళ్లందరి ముందునుంచీ కిలకిలకూసే చిలకల గుంపు ఆకుపచ్చ మెరుపులాగా నీలాకాశంలోకి దూసుకుపోయింది. గాలికి ఊగే వేప గుబురు కొమ్మల్లోంచి రాత్రి కురిసిన మంచు ఆనందాశ్రువులై రాలింది.